ఓట్ల పట్టు చీరలు

రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో... ఇప్పటికే అనేక అడ్డమైన పనులు చేసిన అధికార పార్టీ.. నేడో రేపో ఎన్నికల కోడ్ రానున్న సమయంలో అక్రమాలకు తెరలేపుతోంది. మహిళా ఓటర్లను లక్ష్యంగా చేసుకుని.. వాళ్లందరికీ పట్టుచీరలను ఎరగా వేస్తోంది. అధికార పార్టీ నాయకులు వార్డు వలంటీర్లను వెంటేసుకుని.. ఇంటింటికీ తిరిగి పెళ్లిపత్రికలు ఇచ్చినంత ధైర్యంగా.. ఒక బ్యాగులో పట్టుచీరను తీసుకెళ్లి ఓటర్లకు ఇస్తున్నారు. పట్టపగలే పదుల సంఖ్యలో నాయకులు అధికార పార్టీ నాయకులు ఈ పంపిణీ చేస్తుండడం విశేషం. యథేచ్ఛగా ఓటర్లను ప్రలోభపెడుతున్నా.. పోలీసులు, ఎన్నికల అధికారులు ఎవరూ అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



ఓటర్లకు పంపిణీ చేస్తున్న పట్టుచీర ఉన్న బ్యాగు


పీలేరులో అధికార పార్టీ నాయకులు పట్టుచీర ఉన్న బ్యాగును పంపిణీ చేస్తున్న దృశ్యం

- పట్టపగలే.. పట్టు చీరల పంపిణీ
- అధికార పార్టీ నేతల బరితెగింపు..
- వలంటీర్లతో కలిసి ఇంటింటికీ
- ఓటర్లను ప్రలోభపెడుతుంటే..
- ఎన్నికల సంఘం ఉన్నట్లా? లేనట్లా?


వైసీపీ నాయకులు పంపిణీ చేసిన పట్టుచీర

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణంలో గురువారం ఉదయం వైసీపీ నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి పట్టుచీర ఉన్న ఒక బ్యాగును పంపిణీ చేసి.. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. వాళ్లు ఇచ్చిన బ్యాగు మీద వైసీపీ జెండా రంగుతో పాటు.. ఫ్యాను గుర్తుకే ఓటు వేద్దాం.. అని ముద్రించి ఉంది. ఆ బ్యాగు మీద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఫొటోలు ముద్రించి ఉన్నాయి. గురువారం సాయంత్రానికి సుమారు పీలేరు పట్టణం అంతా చీరల పంపిణీ పూర్తి అయినట్లు సమాచారం. ఇప్పుడు చీర ఇస్తున్నామని, ఓట్ల సమయానికి డబ్బు కూడా ఇస్తామని నాయకులు ఓటర్లకు చెప్తున్నట్లు సమాచారం.

జిల్లా వ్యాప్తంగా..

సాధారణంగా ఎక్కడైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో చీరలు, ముక్కుపుడకలు వంటి వస్తువులతో ఓటర్లను ప్రలోభపెట్టడం చూశాం. అది కూడా ఏ అర్ధరాత్రి పూటో.. ఎవరూ చూడకుండా ఒకరో ఇద్దరో వెళ్లి.. ఇచ్చి ఓటు వేయమని అడుక్కోవడం చూస్తుంటాం. ఇప్పుడు పట్టపగలే మందీమార్బలాన్ని వెంటేసుకుని వెళ్తూ.. ఎటువంటి భయం లేకుండా ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. వచ్చే ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న వైసీపీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు ఈ సామాగ్రి చేరినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో జిల్లా మొత్తం అన్ని నియోజకవర్గాల్లోనూ చీరల పంపిణీ పూర్తిచేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే వలంటీర్లందరికీ అధికార పార్టీ నాయకుల నుంచి సమాచారం అందినట్లు తెలిసింది. ఇంకో వారం పది రోజుల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ లోపే చీరల పంపిణీ పూర్తి చేయాలని అధికార పార్టీ నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

జిల్లా ఎన్నికల అధికారి అక్కడే ఉన్నా..

పీలేరులో గురువారం 100 పడకల ప్రభుత్వాసుపత్రి ప్రారంభం కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పీలేరులోనే ఉన్నా.. పట్టుచీరల పంపిణీ ఆగలేదు. దీన్ని బట్టే అధికారపార్టీ బరితెగింపు ఏంటో అర్థం అవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఎన్నికల విధుల్లో వలంటీర్లను ఎటువంటి పరిస్థితుల్లోనూ.. జోక్యం చేసుకోనీయ వద్దని కేంద్ర ఎన్నికల సంఘం చెప్తోంది. అయితే రాష్ట్రంలో ఎన్నికల సంఘం మాటలు అధికారపార్టీ చెవికి ఎక్కించుకున్నట్లు లేదు.

చేతులు కాలాక?

ఆకులు పట్టుకున్నట్లు..

రాష్ట్రంలో అధికారపార్టీ యథేచ్ఛగా ఓటర్లను ప్రలోభ పెడుతోంది. సాక్షాత్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటర్లను ప్రలోభపెట్టుందుకు కానుకలు, డబ్బు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికల సంఘం నుంచి ఎటువంటి స్పందనా లేదు. చేతులు కాలాకా? ఆకులు పట్టుకున్న చందంగా ఎన్నికల సంఘం తీరు ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందుకు తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికను ఉదాహరణగా పేర్కొంటున్నారు. 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో అధికార పార్టీ యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి ఓటరు కార్డులను డౌన్‌లోడ్ చేసి.. వాటిలో ఫొటోలు మార్ఫింగ్ చేసి దొంగ ఓటర్లతో ఓట్లు వేయించింది. ఈ అరాచకా వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి. ఆ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లను అధికారపార్టీ వేయించింది. మామూలుగా అయితే ఆ ఉప ఎన్నికనే రద్దు చేసి కేంద్ర ఎన్నికల సంఘం తన ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సింది. అయితే ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. ఆ ఎన్నికల్లో గెలిచిన పార్లమెంటు సభ్యుని పదవీ కాలం కూడా మరో రెండు నెలల్లో ముగియనుంది. అయితే దొంగలు పోయిన ఆరునెలలకు కుక్కలు మొరిగిన చందంగా.. ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం హడావుడి చేసి.. ఓటరు కార్డులు డౌన్‌లోడ్ చేయడానికి బాధ్యులను చేస్తూ కలెక్టర్‌తో పాటు, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్, తహశీల్దార్‌ను సస్పెండు చేసి చేతులు దులిపేసుకుంది. ఈ దొంగ ఓటరు కార్డుల వ్యవహారంలో క్రియాశీలకంగా ఉన్న నాయకుల జోలికి వెళ్లలేదు. అచ్చం ఇలాగే.. ఇప్పుడు కూడా అధికార పార్టీ నాయకులు పట్టపగలే ఓటర్లను ప్రలోభపెడుతున్నా.. పట్టించుకోకుండా.. మరెప్పుడో హడావుడి చేస్తారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించి. రాష్ట్రంలో అధికార పార్టీ చేస్తున్న ఓటర్ల ప్రలోభాలకు తెరదించాలని పలువురు కోరుతున్నారు.

పాపిష్టి సొమ్ముతో ఇస్తున్న చీరలు ధరించవద్దు..

పీలేరు నియోజకవర్గ ప్రజలారా! అక్రమమద్యం, ఇసుక, మైనింగ్‌ల ద్వారా సంపాదించిన సొమ్ముతో వైసీపీ నాయకులు పంపిణీ చేసిన బట్టలను ధరించవద్దు. పేదల రక్తమాంసాలు పీల్చి సంపాదించిన సొమ్ముతో ప్రజలను ప్రలోభపెట్టాలని చూస్తున్నారు. వాళ్లు ఇచ్చిన బట్టలను చెత్తబుట్టలో పడేయాలి.

- కిశోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డే

- ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు వెల్లడి
- శంకర్‌కు సముచిత స్థానం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 29: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డే అని పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు స్పష్టం చేశారు. గురువారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో వీరిద్దరూ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కలసి జిల్లాలో పీలేరు టీడీపీ అభ్యర్థిగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, రాయచోటికి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లెకు దాసరిపల్లె జయచంద్రారెడ్డిలను అభ్యర్థులుగా ఎంపిక చేశారన్నారు. అన్ని కోణాల్లో విస్తృతంగా సర్వే నిర్వహించి టీడీపీ, జనసేన కలసి ఉమ్మడి అభ్యర్థులుగా ముగ్గురిని ఎంపిక చేశారని తెలిపారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను చంద్రబాబు విజయవాడకు పిలిపించి మాట్లాడారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తూనే శంకర్‌యాదవ్ స్థాయిని బట్టి ఆయనకు సముచితస్థానం ఇస్తామని చెప్పారన్నారు. దీనిపై శంకర్ కూడా సానుకూలంగా స్పందించారన్నారు. కానీ కొందరు తంబళ్లపల్లె నియోజకవర్గంలో అభ్యర్థులను మారుస్తున్నారని సోషల్ మీడియాలో పుకార్లు లేపి గందరగోళానికి తెర తీస్తున్నారన్నారు. తంబళ్లపల్లెలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జయచంద్రారెడ్డే పోటీ చేస్తారని, శంకర్‌ను కలసి ఆయన సహాయ, సహకారాలతో తంబళ్లపల్లెలో టీడీపీ గెలుపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది జయచంద్రారెడ్డిని వైసీపీ కోవర్టు అని దుష్ప్రచారం చేశారన్నారు. ఆయన రెండు నెలల క్రితం టీడీపీ కండువా కప్పుకున్నారని, గతంలో ఆయన సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి స్థానిక ప్రజాప్రతినిధులతో ఫొటోలు దిగి ఉండవచ్చు. ఇప్పుడు వైసీపీలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు మంచి వ్యక్తులను టీడీపీలోకి చేర్చుకోవడం లేదా అని ప్రశ్నించారు. వెనుకబడిన తంబళ్లపల్లెను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాడని, ఆయన గత చరిత్ర సర్వే చేసే చంద్రబాబు తంబళ్లపల్లెకు ఉన్నత విద్యావంతుడైన జయచంద్రారెడ్డిని ఎంపిక చేశారని తెలిపారు. జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ ఎలాగూ గెలవలేమన్న భావనతో టీడీపీ నాయకుల మధ్య ఉన్న చిన్న విభేదాలను బూచిగా చూపుతూ సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నారని, వీటిని టీడీపీ నాయకులు, క్యాడర్ నమ్మవద్దన్నారు. కచ్చితంగా తంబళ్లపల్లెలో విజయం సాధించగలడనే జయచంద్రారెడ్డిని చంద్రబాబు ఎంపిక చేశారన్నారు. అధిష్ఠానం నిర్ణయానికి పార్టీ శ్రేణులు కట్టుబడి చంద్రబాబును సీఎం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబంలోని ముగ్గురిని ఓడించి, ఈ రాష్ట్రం నుంచి వలస వెళ్లేలా చేస్తామన్నారు. సమావేశంలో వాణిజ్య విభాగం జిల్లా మాజీ అధ్యక్షుడు సీడ్ మల్లికార్జుననాయుడు, మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, పఠాన్‌ఖాదర్‌ఖాన్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సాధన సభకు తరలిరండి

- కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డి

కలికిరి, ఫిబ్రవరి 29: తిరుపతిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న న్యాయ సాధన సభకు తరలిరావాలని ఆ పార్టీ మీడియా చైర్మన్ ఎస్.తులసిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన కడప నుంచి తిరుపతి వెళుతూ కలికిరిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి కీలుబొమ్మలుగా మారడం విచారకరమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేసిందని, ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం పంగనామాలు పెట్టడం శోచనీయమని చెప్పారు. బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ హామీ ఉన్నా తిలోకాదికాలిచ్చారని విమర్శించారు. కడపలో స్టీల్ ప్లాంటుకు స్వస్తి పలికారని, దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదని తెలిపారు. పదేళ్లయినా పోలవరం ప్రాజెక్టు ఇప్పటికీ ప్రశ్నార్థకంగా మిగిలిపోయిందన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, ఒక ఎమ్మెల్యేగానీ, ఎంపీగానీ లేరన్నారు. అలాంటి బలం లేని పార్టీకి ప్రాంతీయ పార్టీలు బానిసల్లాగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీలకు ప్రత్యేక హోదా ఇచ్చే శక్తి లేదు, తెచ్చే శక్తీ లేదని వివరించారు. విభజన చట్టంలో కాంగ్రెస్ ప్రతిపాదించిన ఏ ఒక్క దానిని బీజేపీ నెరవేర్చకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలను పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని తులసిరెడ్డి కోరారు. సమావేశంలో పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సోమశేఖర్ రెడ్డి, నాయకులు డాక్టర్ శ్రీవర్ధన్, బీఆర్ మల్లికార్జున, ఫయాజ్, రామకృష్ణారెడ్డి, శ్రీధర్, చిన్నికృష్ణ, శ్రీదేవి, సైదాబాను, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

- 54 కేంద్రాలు, 29,877 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పరిశీలించిన డీఐఈవో కృష్ణయ్య


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఐఈవో కృష్ణయ్య

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 29: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాల్లో 29,877 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే డీఐఈవో కృష్ణయ్య ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన బెంచ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, గాలి, వెలుతురు ఉండే విధంగా అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా అధికారి కృష్ణయ్య ఆధ్వర్యంలో ముగ్గురు డీఈసీ మెంబర్స్, ఒకరు స్పెషల్ ఆఫీసర్‌తో పాటు రెండు బృందాలు ఫ్లయింగ్ స్క్వాడ్, మరో రెండు బృందాలు సిట్టింగ్స్ స్క్వాడ్ సభ్యులు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పర్యవేక్షణ చేయనున్నారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు జిల్లా వ్యాప్తంగా 26 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిని పర్యవేక్షించేందుకు 9 మంది కస్టోడియన్ సభ్యులను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ప్రథమ సంవత్సరం చదువుతున్న 14,821 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 15,057 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్ష కేంద్రాలు పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంటాయని, కేంద్రాల బయట ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో పోలీసు అధికారులతో పాటు సిబ్బంది పర్యవేక్షణ ఉంటుందని డీఐఈవో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న పరీక్షలకు విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. అలాగే విద్యార్థులు హాల్ టికెట్, ప్యాడ్, పెన్‌తో రావాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, స్మార్ట్‌వాచీలు, సెల్‌ఫోన్‌లు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- 229.99 గ్రాముల బంగారం రికవరీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చైతన్య

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 29: రాజంపేటలో ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ చైతన్య తెలిపారు. గురువారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఆరు వరుస దొంగతనాలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 229.99 గ్రాముల బంగారు, 12 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. రాజంపేట మండలం కూచివారిపల్లెలో పట్టపగలు ఓ ఇంటిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. సత్యసాయి జిల్లా కదిరి మండలం బి.పట్నం గ్రామానికి చెందిన యనమల ఆంజనేయులు, అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన ఎం.రామాంజనేయులు అనే ఇరువురు ఓ స్కూటీపై రాయచోటి నుంచి రాజంపేటకు వస్తుండగా గురువారం పట్టుకుని విచారిస్తే వారు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారన్నారు. పెనగలూరు ప్రాంతంలో రెండు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. ముద్దనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ దొంగతనానికి ఇరువురు పాల్పడ్డారన్నారు. వీరు దోచుకున్న సొమ్మును కదిరి మండలం ముథూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి నగదును తీసుకున్నారన్నారు. ఈ విధంగా ఆరు చోరీలకు పాల్పడ్డ వారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు. సమావేశంలో రాజంపేట పట్టణ రూరల్ సీఐలు మంజునాథరెడ్డి, మద్దయ్యఆచారి, ఎస్ఐలు మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడపకు చేరుకున్న కంచి పీఠాధిపతి



కడప (కల్చరల్), ఫిబ్రవరి 29 : కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీస్వామి గురువారం ఉదయం 8.30 గంటలకు నగరంలోని చిన్మయ మిషన్ వారి లలితా పంచాయతన దేవాలయానికి విచ్చేశారు. వారికి భక్తులు, చిన్మయమిషన్ సభ్యులు, బ్రాహ్మణ సంఘాల వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంద్రమౌళేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి త్రికాల పూజ నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి భక్తులకు ఆశీర్వాదం అందించారు. శుక్రవారం సువాసినీ పూజ, త్రికాల అభిషేక పూజతో పాటు ఉదయం 7 నుంచి 9 గంటల వరకు భక్తులకు దర్శనం, ఆశీర్వాదం అందజేస్తారని చిన్మయమిషన్ కడప అధ్యక్షుడు తురియానందస్వామి తెలిపారు.

ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో..


జిల్లా కార్యాలయాల సముదాయం

- జిల్లా కార్యాలయాలకు కరెంటు కష్టాలు
- కలెక్టరేట్ ప్రాంగణంలో తప్పని తిప్పలు
- ఇలా ఉంటే విధులెలా నిర్వహించాలి
- ఆందోళనలో ఉద్యోగులు

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 29: అక్కడ కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో ఎవరూ చెప్పలేరు. దాదాపు పది ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న సముదాయమది. విద్యుత్ కోతతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుండటంతో పాటు కరెంట్ కోతలతో ఫ్యాన్లు తిరగక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కరెంట్ ఇలా వస్తూ పోతూ ఉంటే తమ తాము విధులెలా నిర్వహించాలని సిబ్బంది వాపోతున్నారు. జిల్లా ఏర్పడి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటివరకు కలెక్టరేట్ వెనుక ఉన్న జిల్లా కార్యాలయంలో కరెంటు కోతలు తప్పడం లేదు. ఇక్కడ దాదాపు పది జిల్లా ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కరెంటు వస్తూ పోతూ ఉంటోందని అధికారులు, సిబ్బంది చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ఇలా కరెంటు కోతలు ఉంటే సమయానికి పనులు ఎలా చేయాలో అర్థం కాక ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. ఈ కార్యాలయంలో ఉన్న వారందరికీ ఎన్నికల అధికారులుగా రకరకాల పనులు కలెక్టర్ అప్పచెప్పారు. ఎన్నికల సమయంలో ఏదైనా పని అప్పజెబితే గంటల్లో చేసి చూపించే విధంగా స్పీడు ఉండాలి. కానీ ఇక్కడ కరెంటు కోతలు ఉండడంతో ఏ పనిచేస్తామన్నా అంతలోనే కరెంటు పోతోంది. దీనివల్ల ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్, స్పందన హాల్ ఇంకా కొన్ని రూములకు జనరేటర్‌తో కరెంటు సప్లై ఇచ్చి ఉన్నారు. కలెక్టరేట్ వెనక ఉన్న జిల్లా సర్వేశాఖ, అగ్నిమాపక శాఖ, జిల్లా ఖజానా కార్యాలయం, సివిల్ సప్లై కార్యాలయం, జిల్లా హౌసింగ్ కార్యాలయాలకు విద్యుత్ కోతలు నిత్యం చుక్కలు చూపిస్తున్నాయి. జిల్లా ఏర్పాటు చేసే ముందు కొన్ని కార్యాలయాలకు గతంలో ఉన్న కరెంటును మాత్రమే తీసుకోవడం వల్ల ఆ లైన్‌లో దాదాపు రోజుకు 10 సార్లు కరెంటు పోవడం రావడం జరుగుతూనే ఉంది. కొన్ని కార్యాలయాల్లో వైరింగ్ సరిగ్గా లేక లైట్లు అంతంత మాత్రమే వెలుగుతున్నాయి. ఇక ఫ్యాన్ల గురించి చెప్పాల్సిన పని లేదు. అవి తిరుగుదామా వద్దా అన్న విధంగా పనిచేస్తున్నాయి. ప్రతి ఏడాది వేసవి వచ్చేసరికి పట్టణంలో కరెంటు కోతలు ఉండడంతో పాటు జిల్లా కార్యాలయాల్లో కూడా కరెంటు కోతలు మొదలయ్యాయని కొంతమంది ఉద్యోగులు చెబుతున్నారు. కొన్ని కార్యాలయాల్లో ఫ్యాన్లు, లైట్లు ఉద్యోగులు తమ సొంత డబ్బులు పెట్టి చేయించుకున్న పరిస్థితి ఇక్కడ ఉంది. ఇప్పటికైనా అధికారులు కరెంటు కోతలు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్యోగులు కోరుతున్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూస్తాం..

కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న జిల్లా కార్యాలయంలో విద్యుత్ కోతలు ఉన్న విషయం నాకు తెలియదు. ఏదైనా సమస్య ఉంటే మా లైన్‌మెన్‌కు చెప్పి చేపిస్తాను. ఇకపై విద్యుత్ కోతలు లేకుండా చూసే బాధ్యత మాది.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్


కరెంటు పోవడంతో ఖాళీగా కూర్చున ఏటీవో

కరెంటు కోతలతో చాలా ఇబ్బందిగా ఉంది..



ఎన్నికల సమయంలో కరెంటు కోతలు ఉండడం వల్ల పనిచేసేందుకు చాలా ఇబ్బందిగా ఉందని మా సిబ్బంది నా దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా కార్యాలయాలకు కరెంటు కోతలు ఉంటే ఎన్నికల సమయంలో పని ఎలా చేస్తాం. దీనిపైన విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- జయరాజ్, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ

ఉక్కపోతతో అల్లాడుతున్నాం..



దాదాపు పది రోజుల నుంచి కరెంటు వస్తూ పోతోంది. దీనివల్ల మా సిబ్బంది కంప్యూటర్ వర్క్ చేసుకునే దానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. జీతాల టైంలో కరెంటు ఇలా ఉంటే మేము ఎలా జీతాలు అప్‌లోడ్ చేయాలో మీరే అర్థం చేసుకోవాలి. ఈ విషయంపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి పెట్టి మా కార్యాలయానికి నిరంతరం కరెంటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- మహబూబ్, జిల్లా ఖజానా అధికారి

ట్రాక్టరు ప్రమాదంలో రైతు మృతి



ప్రమాదంలో మృతి చెందిన లక్షుమయ్య

రాజుపాలెం, ఫిబ్రవరి 29 : మండల పరిధిలోని కొరపాడు గ్రామానికి చెందిన జల్లి లక్షుమయ్య (39) అనే రైతు ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందినట్లు రాజుపాలెం ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. మృతుడి భార్య రామలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయాన్నే తన పొలానికి ట్రాక్టరు పంపుసెట్టు ద్వారా నీరందించేందుకు వెళ్లాడు. పంపునకు పైపులు తొడుగుతున్న సమయంలో పక్కనే పంపుసెట్టు ఆడుతున్న ట్రాక్టరు పంపుసెట్టుకు మృతుడి లుంగీ చుట్టుకోవడంతో లక్షుమయ్య కూడా వేగంగా తిరగడంతో తలకు వెనుక భాగం తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వలంటీరు మృతి



బాబయ్య మృతదేహం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 29 : అనుమానాస్పద స్థితిలో బాబయ్య (25) అనే వలంటీరు మృతి చెందడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్రపాటిపల్లెలో బాబయ్య అనే వలంటీరు బుధవారం రాత్రి పొలం వద్ద విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. చుట్టుపక్కల వారు తెలపడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం పోరుమామిళ్లకు తరలించారు. కానీ అప్పటికే అతను మరణించినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. తమ కుమారుడి మరణంపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు హుస్సేనమ్మ, దాదాపీరయ్య అనుమానం వ్యక్తం చేశారు. దీంతో గురువారం ఉదయం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేశారు. రిపోర్టులో వచ్చిన నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని ఒంటిమిట్టలో గత నెల 21వ తేదీ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన మహిళ కేసును గురువారం ఒంటిమిట్ట పోలీసులు ఛేదించారు. సీఐ పురుషోత్తంరాజు తెలిపిన వివరాల మేరకు... జనవరి 21వ తేదీ ఒంటిమిట్టలోని గంగమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న సుంకు సువాసిని (46) అనే మహిళ భర్త సుబ్బారావు ఇరువురు మొబైల్ క్యాంటీన్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. భార్యాభర్తల మధ్య ఆరోజు రాత్రి గొడవ జరిగి తోసుకోవడంతో మహిళ తలకు బలమైన రక్తగాయమై మృతి చెందింది. వెంటనే ఎవరికీ అనుమానం రాకుండా వారి ఇంటి ఎదురుగా ఉన్న పాడుబడిన భవనం పక్కన భార్య మృతదేహానికి పెట్రోలు పోసి దహనం చేశాడు. నిందితుడు నేరం ఒప్పుకోవడంతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో ఐదుగురికి జైలు శిక్ష



జైలుశిక్ష పడ్డ ముద్దాయిలు

సంబేపల్లె, ఫిబ్రవరి 29: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామం కొత్తపల్లి బిడికి నాగారపమ్మ గుడిలో 10 నెలల క్రితం చోరీ కేసులో ఐదుగురు ముద్దాయిలకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసుల వివరాల మేరకు... గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీ దొంగతనం కేసులో కోడూరు చిన్న, పి.శ్రీను, సి.నాగరాజు, ఎస్.పెంచలయ్య, కె.గంగయ్యలపై అప్పట్లో కేసు నమోదైంది. విచారణ అనంతరం రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఇషారత్ ఫాతిమా నిందితులకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొవ్వూరు, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న డాక్టర్ మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. మైదుకూరు మండలం లెక్కల వారిపల్లికి చెందిన అంకిరెడ్డిపల్లి కొండారెడ్డి(37) రాజమహేంద్రవరం బొల్లినేని(కిమ్స్) ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. గత నెల 25వ తేదీ రాత్రి డ్యూటీ ముగించుకుని 26వ తేదీ ఉదయం బైక్‌పై దేవరపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతూ బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కూలీల ఆకలి కేకలు

- రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదంటూ ఆవేదన
- కుటుంబం కోసం వలస వచ్చాం...
- కూలీ డబ్బులు అందక పస్తులు ఉంటున్నాం..
- పులివెందుల జగనన్న లేఅవుట్‌లో కూలీల దీనగాథ



తమ బిడ్డకు జ్వరం వస్తున్నా ఆసుపత్రికి వెళ్లేందుకు కూడా డబ్బులులేవని చెబుతున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 29: వారంతా వలస కూలీలు. పొట్టచేతపట్టుకొని కూలీ పనుల కోసం దేశంలో ఎక్కడ పనులు జరుగుతుంటే.. అక్కడకు వెళ్లి పనులు చేసుకొని వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. ఇలాంటి కూలీలు పులివెందులకు వచ్చారు. పులివెందుల ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కావడంతో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. కొందరు కాంట్రాక్టర్లు, మేస్త్రీలు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా తదితర రాష్ట్రాల నుంచి కూలీలను పులివెందులకు రప్పించుకున్నారు. అలా వచ్చిన వీరిలో కొంత మంది పులివెందులలో నిర్మిస్తున్న జగనన్న మెగా హౌసింగ్ కాలనీలో పనులకు కుదిరారు. వీళ్లకు కాంట్రాక్టర్లు కూలీ డబ్బులు, జీతాలు బాగా ఇచ్చేవారు. కుటుంబ పోషణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునేవారు. అప్పుడప్పుడు సొంత ఊళ్లకు వెళ్లి తల్లిదండ్రులను చూసుకొని, డబ్బులు ఇచ్చి తిరిగివచ్చి పనులు చేసుకునేవారు. అయితే అలాంటి కూలీలు ప్రస్తుతం ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. రెండు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం వస్తే ఆసుపత్రికి వెళ్లడానికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లల కడుపునింపి తాము పస్తులుంటున్నామని దీనంగా చెబుతున్నారు. కొంతమంది ఇప్పటికే వెళ్లిపోయారు, తమకు కూలీ డబ్బులు ఇస్తే తాము సొంత ఊళ్లకు వెళ్లిపోతామని చెబుతున్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న పులివెందుల జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లోని కూలీలు

రెండు నెలలుగా డబ్బులు ఇవ్వలేదు

తమకు రెండు నెలలుగా కూలీ డబ్బులు ఇవ్వలేదని మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీలు తెలిపారు. గతంలో వారానికి ఒకసారి తిండి ఖర్చులకు మనిషికి రూ.1000 ఇచ్చేవారని, అది కూడా ఇప్పుడు ఇవ్వలేదన్నారు. చేతిలో డబ్బులు లేక పస్తులు పడుకుంటున్నామని, పిల్లలు ఆకలికి తట్టుకోలేకపోతున్నారని.. బిస్కెట్ ప్యాకెట్ కొని ఇచ్చి తాము ఖాళీ కడుపుతో పడుకుంటున్నామన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ఆసుపత్రికి వెళ్లి చూపించుకోవడానికి ఇక్కడి నుంచి దాదాపు పది కిలోమీటర్లు వెళ్లి రావాలి. కాంట్రాక్టర్‌కు తెలియజేస్తే ఆయన ఫోన్ ఎత్తడంలేదు. రోగాల బారిన పడిన మాకు ఏదైనా జరిగితే మమ్మల్ని తీసుకెళ్లడానికి అంబులెన్స్ ఖర్చులు రూ.50వేలు అవుతాయన్నారు. పనులు నిలబెట్టినా కూడా కాంట్రాక్టర్ పట్టించుకోలేదన్నారు. అధికారులు తమ బాధను అర్థం చేసుకొని మాఊరికి పంపించాలని వారు కోరుతున్నారు. కాంట్రాక్టర్‌ను వివరణ అడిగేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పనులు నిలబెట్టిన విషయం వాస్తవమే..

జగనన్న మెగా హౌసింగ్ లేఅవుట్‌లో ప్రస్తుతం పనులు నిలబెట్టిన విషయం వాస్తవమే. ఇక్కడ 2500 వరకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బిల్లులు రావాల్సి ఉంది. బిల్లులు ఖచ్చితంగా వస్తాయి. అప్పటి వరకు పనులకు వచ్చిన కూలీలకు డబ్బులు ఇవ్వాల్సి బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంటుంది. రెండు నెలలుగా వారికి కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో పనులు నిలబెట్టాల్సిన పరిస్థితి. త్వరలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయి. పనులు మళ్లీ మొదలవుతాయి.

- సంజీవరాయుడు, హౌసింగ్ ఏఈ, పులివెందుల

వైద్య కళాశాలలో ఘనంగా స్నాతకోత్సవం



పట్టాలు ప్రదానం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 29 : కడప నగర పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ అంజనేయప్రసాద్ ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజ రయ్యారు. ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, క్యాన్సర్ కేర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల సూపరింటెండెంట్ సురే శ్వర్ రెడ్డి, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు, అడ్మినిస్ట్రేటివ్ వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ శారద, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌లు విద్యా ర్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ కనిపించే దేవుడు వైద్యుడని.. వైద్యులు తమ వృత్తి పట్ల అంకితభావంతో నిబద్ధతతో ఉండాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, వైద్యులు, విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలిక అనుమానాస్పద మృతి ?

చిన్నమండెం, ఫిబ్రవరి 29: మండలంలోని కేశాపురం కస్పాకు చెందిన బాలిక నందిని (5) అనుమానాస్పద స్థితిలో మృతిచెందిందని ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. గురువారం సాయంత్రం నందిని మరణించినట్లు సమాచారం అందిందడంతో రాయచోటి డీఎస్పీ మహమ్మద్‌బాషా, రాయచోటి రూరల్ సీఐ తులసిరామ్‌తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లామన్నారు. బాలిక మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆర్ఎంకు ఆర్టీసీ ఎండీ ప్రశంసలు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 29: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో మాసోత్సవాలను పురస్కరించుకుని 2023 అక్టోబరు 26 నుంచి నవంబరు 25వ తేదీ వరకు కార్గో కడప రీజియన్‌లో అత్యధికంగా 14,765 డోర్ డెలివరీ బుక్ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కార్గో ద్వారా సుమారు 9.08 కోట్ల రూపాయల ఆదాయం సంపాదించి కడప జోన్‌లో ప్రథమస్థానం సాధించింది. దీంతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్పందించి కడప రీజియన్ మేనేజరు ఎస్. గోపాల్ రెడ్డిని విజయవాడలోని తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఆర్టీసీ కడప జోన్ ఇంతటి ఆదాయానికి కారకులైన కార్గో సిబ్బంది, ఆయా డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, ఏటీఎంలకు, ఆర్టీసీ సిబ్బందికి కడప రీజియన్ మేనేజరు గోపాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సౌత్‌జోన్ పోటీలకు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

వేంపల్లె, ఫిబ్రవరి 29: కేరళ రాష్ట్రం కొట్టాయం, ఎంజీయూలో మార్చిలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొననున్నట్లు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త తెలిపారు.

ఫిబ్రవరి 28వ తేదీ ఆర్కేవ్యాలీలో యూనివర్సిటీ అంతర్ విశ్వవిద్యాలయాల జట్ల ఎంపికలు జరిగాయన్నారు. హ్యాండ్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడాంశాల్లో ఎంపికలు జరగ్గా నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం జట్లు పాల్గొన్నాయన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 29 : పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు. గురువారం ఎంఈవో కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ-1 పాలెం నారాయణతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మండలం ముందంజలో ఉండాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బైజూస్ ట్యాబ్స్ నిర్వహణ వంటి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ ఇర్షాద్ అహ్మద్, సీఆర్పీ ఆదిమూలం శంకర్, రాజు, పెంచలయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

గుక్కెడు నీరివ్వండి...!

- గొంతెండిపోతున్న పల్లెలు
- మంచినీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు
- ఎండిపోయిన మంచినీటి పథకం బోర్లు
- స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 29: పల్లెల్లో గొంతెండిపోతోంది. మంచినీటి బోర్లు ఎండిపోయి వ్యవసాయ బోర్ల వద్దకు ప్రజలు పరుగులు తీస్తున్నారు. వ్యవసాయ బోర్ల రైతులు వారి పొలాలకు నీరు సరిపోలేదని, పంటలు ఎండుతున్నాయని అక్కడికి రావద్దని చెబుతున్నారు. దీంతో పల్లెవాసుల తాగునీటి కష్టాలు దేవుడికే ఎరుక. గుక్కెడు మంచినీరు అందించండి అని స్పందనలో ఎన్ని అర్జీలు ఇచ్చినా మా సమస్యల గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచ్‌లు చేతులెత్తేయగా, కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా చేయమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పందిళ్లపల్లె, జె.వడ్డెపల్లె, సోములవాండ్లపల్లె, అప్పలరాజుగారిపల్లె, దళితవాడ గ్రామాల్లో తాగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జె.వడ్డెపల్లెలో 200 కుటుంబాలు వారు నివసిస్తున్నారు. అందరూ వ్యవసాయ కూలీలే. ఈ గ్రామంలో గతంలో నాలుగు మంచినీటి పథకం బోర్లు వేశారు. ప్రస్తుతం నాలుగు బోర్లు ఎండిపోయాయి. అందులో ఒక బోరులో సన్నగా గంటకు ఒక బిందెడు నీరు వస్తున్నాయని, తెల్లవారగానే కూలికి వెళ్లకుండా సన్నగా నీరు వస్తున్న మంచినీటి బోరు వద్ద బిందెలు వరసలో పెట్టుకుని తమ వంతు వచ్చినప్పుడు గంట అక్కడే ఉండి బిందెడు నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

గుక్కెడు మంచినీటి కోసం గొడవలు కూడా జరుగుతున్నాయని మహిళలు తెలిపారు. ఏడాదిలో రెండు మంచినీటి బోర్లు 350 అడుగులు వేసినా చుక్కనీరు పడలేదని గ్రామస్తులు తెలిపారు. జె.వడ్డెపల్లెలో 3 వేలకు పైగా పశువులు, గొర్రెలు, మేకలు ఉన్నాయని పశువులకు, మేకలకు, గొర్రెలకు నీరు లేక జీవాలను విక్రయిస్తున్నట్లు వెంకటరమణ, సాలమ్మ, చిన్న రామయ్య తెలిపారు. పందిళ్లపల్లె గ్రామానికి (జేజేఎం) జల్ జీవన్ పథకం కింద రూ.40 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఎస్ఈ, ఏఈలు స్వయంగా గ్రామానికి వచ్చి మా అగసాట్లు కళ్లారా చూసి వెళ్లారని అయినా ఫలితం లేదని, ఆ నిధులు ఏమయ్యాయో తెలియడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేవారని, వాటికి బిల్లులు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా నిలిపివేశారని వారు తెలిపారు. బోర్లు వేయాలంటే పంచాయతీలో నిధులు లేవని ఆర్‌డబ్లుఎస్ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని సర్పంచు అంటున్నాడని గ్రామస్తులు అంటున్నారు. ఇటీవల రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులు లక్ష రూపాయాలు వెచ్చించి బోరు వేయించాడని అయినా బోరులో నీరు పడలేదన్నారు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని లేని పక్షంలో ఊరు ఖాళీ చేసి వేరే ఊరికి వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మంచినీటి బోరు నుంచి వస్తున్న అరకొర నీరు

అదే పంచాయతీలోని సోములవాండ్లపల్లెలో నీటిలో ఫ్లోరైడ్ ఉందని అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని, కనీసం పశువులకైనా ఊరిలో ఉన్న మంచినీటి బోరు నీరును ఉపయోగించుకుందాం అనుకుంటే ఆ బోరు చెడిపోయి రెండు నెలలు కావస్తోందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సోములవాండ్లపల్లె వాసులు తెలిపారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ప్రస్తుతం అరకొర నీరు బోర్ల నుంచి వస్తున్నాయని మార్చి నెల వచ్చేసరికి బోర్లలో ఉన్న నీరు అడుగంటిపోతాయని, మంచినీటి పథకం బోర్లను రీబోర్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీరు సమస్య ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.





వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న వృద్ధురాలు, నీరు పడక వృథాగా ఉన్న బోరు, వ్యవసాయ బోరు వద్ద వేచి ఉన్న మహిళ

రూ.90 లక్షలు మంజూరయ్యాయి

తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం 90 లక్షల రూపాయలు మంజూరు చేసింది. టెండర్లు పిలిచి సమస్య ఉన్న గ్రామాల్లో మంచినీటి బోర్లు వేయిస్తాం. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. జె.వడ్డెపల్లెలో ఇప్పటికే రెండు బోర్లు వేశాం. అయినాఅ నీరు పడలేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా. జె.వడ్డెపల్లెకు మాత్రం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

- కిశోర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఎవరూ పట్టించుకోలేదు

మా గ్రామంలో 200 కుటుంబాలు ఉన్నాయి నాలుగు మంచినీటి బోర్లు ఉండేవి అన్నిటిలోను నీరు ఎండిపోయి ఒక బోరులో మాత్రం చుక్కచుక్క నీరు వస్తోంది. గంటల తరబడి వేచి ఉంటే గాని గుక్కెడు మంచినీరు దొరకడం లేదు. ఎవరైనా పొలాలకు నీరు వదిలితే అక్కడికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. వ్యవసాయ బోర్లు మాకు ఆధారం. ఆ బోర్లల్లో నీరు తగ్గిపోవడంతో వారు కూడా బోర్ల వద్దకు రావద్దంటున్నారు. అధికారులు మా సమస్యను పట్టించుకుని వెంటనే తీర్చాలి.

- పశువుల నాగసుబ్బమ్మ, జె.వడ్డెపల్లె

ట్యాంకర్ల ద్వారా నీరిమ్మని అడిగినా పట్టించుకోలేదు

ఊరిలోని బోర్లు ఎండిపోయి ఏడాది కావస్తున్నా నీరో రామచంద్రా అంటూ అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదు. రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాగోడు చూడలేక లక్ష రూపాయలు పెట్టి బోరు వేయించారు. అయినా అందులో నీరు పడలేదు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందించండని అధికారులను సర్పంచు అడిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామస్తులందరూ కలిసి స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

- తమ్మిశెట్టి రవణమ్మ, జె.వడ్డెపల్లె

పేదలను అప్పులపాలు చేసిన జగన్‌రెడ్డి

● మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 29: జగనన్న ఇళ్ల పేరుతో మంత్రి జగన్‌రెడ్డి పేదలను అప్పుల పాలు చేస్తున్నారని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఇళ్ల పేరుతో చేస్తున్న అరాచకాలను దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి జగన్ ఏడాదికి 5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తానని హామీనిచ్చి మాట తప్పి మడమ తప్పారన్నారు. ఉచితంగా ఇవ్వక పోగా గృహ నిర్మాణం పేరుతో పేదలను అప్పులపాలు చేశారన్నారు. గృహాలు నిర్మించుకోక పోతే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించి పేదల చేత అప్పు చేయించి ఇళ్లు కట్టించారని, వారికి బిల్లులు చెల్లించక అప్పుల పాలు చేశారన్నారు. ఓటీఎస్ పేరుతో ఎన్టీఆర్, చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా రూ.10 వేల నుంచి రూ.30 వేలు జగన్‌రెడ్డి వసూలు చేశారని విమర్శించారు. ఊరికి దూరంగా నివాసయోగ్యం కాని సెంటు పట్టా ఇచ్చారని, భారతి సిమెంటుతో బూడిద కలిపి కట్టిన ఇళ్లు కూలిపోతున్నాయని ఆరోపించారు. చంద్రబాబు 5 ఏళ్లలో 12 లక్షలు నాణ్యమైన ఇళ్లు కట్టగా, జగన్ హయాంలో పది శాతం కూడా ఇళ్లు పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు, టీడీపీ నాయకులు పదిలం శివ, మస్తాన్, ఇర్షాద్, అక్రమ్, సద్దాం, ఫైరోజ్, ఆశిక్ తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం మైనార్టీ మహిళలతో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

70 కుటుంబాలు పార్టీలో చేరిక

రాయచోటి పట్టణం ఎస్‌ఎన్‌కాలనీలోని టీడీపీ కార్యాలయంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖానం మేనల్లుడు అయూబ్, ఇర్షాద్, అక్రమ్ ఖాన్‌ల ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని 7వ వార్డుకు చెందిన 70 కుటుంబాల ముస్లిం మైనార్టీలు గురువారం మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ ముస్లింలపై కపట ప్రేమను చూపిస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మహిళలు నాజియా, ఆయేషా, రుబీనా, గౌసియా, షబానా, రెహానా, ముస్లిం మైనార్టీ నాయకులు, ముస్లిం మహిళలు పాల్గొన్నారు.

మైనార్టీ యువకులతో సమావేశం

నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటిలో టీడీపీ గెలుపే లక్ష్యంగా తమ ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం పట్టణంలోని సుండుపల్లె రోడ్డులో గల ఇరానీ చాయ్ కేఫ్‌లో మైనార్టీ యువకులు, నేతలను కలిసి పట్టణంలోని సమస్యలు, పలు అంశాలపై చర్చించారు. ఈ చర్చలో ఔత్సాహిక యువకులు, పలువురు నేతలతో మండిపల్లి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడితే యువకులకు విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయని యువకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నేతలు సైఫుల్లా, రిజ్వాన్, అయూబ్, గోల్డ్ ఇబ్రహీం (బాబు), గోల్డ్ బాషావలి, సగీర్, షంషీర్‌రెడ్డి, మహబూబ్‌బాషాలతో పాటు పలువురు మైనార్టీ యువత పాల్గొన్నారు.

నేటి నుంచి పోలీసు 30 యాక్ట్ అమలు


పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ

నందలూరు, ఫిబ్రవరి 29: రాజంపేట డీఎస్పీ వి.ఎస్.కె. చైతన్య ఉత్తర్వుల మేరకు మండల పరిధిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా శాంతి భద్రతలను పరిరక్షించుట కొరకు మార్చి 1 నుంచి 31వ తేది వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఎస్ఐ విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిధిలో ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలు బంద్ వంటివి రాజంపేట డీఎస్పీ అనుమతి లేనిదే జరపవద్దని, ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ

ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ వి.ఎస్.కె.చైతన్య, మన్నూరు సీఐ మంజునాథ్‌రెడ్డిల ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌లను పర్యవేక్షించినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ నందలూరు పంచాయతీ పరిధిలోని 90, 91, 92 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న వసతులను గమనించారు. ఈయన వెంట పోలీసులు దర్బార్‌బాష, మహేంద్ర, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంత వేలంపాట

రామాపురం, ఫిబ్రవరి 29: మండల కేంద్రమైన రామాపురంలో పశువుల సంత, బస్టాండు గేటుకు సంబంధించి 2024-25 సంవత్సరంలో వసూలు హక్కు కల్పించేందుకు శుక్రవారం మధ్యాహ్నం సంత జరుగు స్థలం వద్ద పంచాయతీ విస్తీర్ణ అధికారి ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుందని నల్లగుట్టపల్లె పంచాయతీ సెక్రటరీ విమలకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారుడు నల్లగుట్టపల్లె గ్రామ పంచాయతీకి ఎలాంటి అప్పు ఉండకూడదని, ముందుగా శనివారం పశువుల సంతకు రూ.2.50 లక్షలు, బస్టాండు గేటుకు రూ.50 వేలు రామాపురం మండల రెవెన్యూ అధికారిచే సాల్వెన్ సర్టిఫికెట్‌ను పొంది వేలంపాట వద్దకు తీసుకురావాలన్నారు.

జబ్బార్ భౌతికకాయానికి నివాళులు

చిన్నమండెం, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోని సీనియర్ టీడీపీ నాయకుడు క్రాక్ జబ్బార్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు గురువారం ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేదన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ పెద్దలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

● పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్

సుండుపల్లె, ఫిబ్రవరి 29: మండలంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు లేదా ఇతరులు పరీక్షా కేంద్రం సమీపంలో ఉండరాదన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 490 మంది బాలబాలికలు పరీక్షలకు హాజరుకానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని, అరగంట ముందుగా పరీక్షా కేంద్రానికి విద్యార్థులు రావాలని కోరారు.

పదవీ విరమణ తప్పనిసరి

వీరబల్లి, ఫిబ్రవరి 29: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గంగాదేవి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం హెచ్‌ఎంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ సత్యకుమార్, వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

● ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్


కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: ఏపీలో ప్రభుత్వం ఎన్నికల్లో రద్దు చేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాలి చంద్ర, సలీంబాషాలు డిమాండ్ చేశారు. ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి పవర్ ఫైనాన్స్ పేరుతో కార్పొరేషన్లకు దారిని మళ్లించుకున్న నిధులను వెంటనే బోర్డులో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గంగాధర్, సికిందర్, వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, వెంకటయ్య, వెంకటేశ్, సుబ్రమణ్యం, హుస్సేన్, బాలకృష్ణ, ప్రసాద్, గఫూర్, రియాజ్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

రామాపురం, ఫిబ్రవరి 29: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి దేవస్థానంలో గురువారం మహాగణపతి, సుబ్రమణేశ్వర, హనుమాన్ సమేత సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహకులు, ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు మాట్లాడుతూ గ్రామస్తులు సొంత నిధులు రూ.50 లక్షలతో ఈ ఆలయాన్ని నిర్మించారని, గురువారం ఉదయం నుంచి ప్రాతఃకాలపూజ, తదుపరి సీతారామ కల్యాణోత్సవం, తీర్థప్రసాద వినియోగం, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రమౌళి, రమేశ్, కృష్ణయ్య, బాలకృష్ణ, సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, బండారు బాబు, మద్రాసు రాజాలు ఉత్సవ విగ్రహాలకు వేదపండితులచే కల్యాణోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామంలోని ప్రజలే కాకుండా ఇతర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరైనట్లు కార్యనిర్వాహకులు తెలిపారు.

పోలీసుశాఖలో మీసేవలు అభినందనీయం

● పదవీ విరమణ పొందిన సిబ్బందిని ఘనంగా సన్మానించిన ఎస్పీ


పదవీ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 29: పోలీసుశాఖలో మీ సేవలు అభినందనీయమని ఎస్పీ కృష్ణారావు అన్నారు. గురువారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలో పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య, హోంగార్డ్ రమేశ్‌లను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఎన్నో వందల వృత్తులు ఉన్నాయని, అన్నింటికన్నా ముందుండి ప్రజా సేవ చేయడంలో ప్రజలకు దగ్గరగా ఉండేది ఒక పోలీసు ఉద్యోగం మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఆర్ఐ (అడ్మిన్) ఎస్.శ్రీనివాసులు, ఎంటీవో పెద్దయ్య, ఆర్ఎస్ఐలు నటరాజ్, సోమశేఖర్, చంద్రశేఖర్‌లు, రాయచోటి, రాజంపేట సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జిలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

పుల్లంపేట, ఫిబ్రవరి 29: జిల్లా స్థాయి స్పీచ్ కాంపిటీషన్‌లో పుల్లంపేట కస్తూర్బా గాంధీ బాలికల, పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకొన్నారు. రాజంపేటలోని మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ అండ్ టెక్నాలజీ వరమా.. శాపమా అనే అంశంపై విద్యార్థులు స్పీచ్ ఇచ్చారు. ఈ అంశంపై ఉత్తమ స్పీచ్ ఇచ్చిన పుల్లంపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థినులు సాయిగౌతమి, జేబీషాలిని జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకొని షీల్డ్, మెడల్, సర్టిఫికెట్లు పొందారు.

విజ్ఞాన శాస్త్రం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యం

పెనగలూరు, ఫిబ్రవరి 29: విజ్ఞాన శాస్త్రం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని చక్రంపేట ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ గోపాలకృష్ణ అన్నారు. గురువారం పాఠశాల ప్రాంగణంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్టులు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి

- టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ప్రసాద్‌బాబు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రసాద్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 29: ప్రతిఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని బుట్టిగారిపల్లెలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి భావంతో సత్ప్రవర్తన, మానసిక ప్రశాంతతను పొందవచ్చన్నారు. అంతేగాక దేవాలయాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరిగి సంస్కృతి, సాంప్రదాయాలను పాటించాలన్నారు. అందుకోసమే పెద్దలు ప్రతి గ్రామంలో గుడి, బడికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 29: పశ్చిమ బెంగాల్‌లో జరిగిన లైంగిక దోపిడీని అరికట్టాలని కోరుతూ బీజేపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు రాజంపేట గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ నేతలు నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగల్ రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ నాయకులు, ఆ ప్రాంత ఎమ్మెల్యే షాజహాన్, వారి అనుచరులు ఇంటింటి సర్వే పేరుతో వెళ్లి మహిళలపై లైంగికంగా దాడి చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆదినారాయణ, హరిప్రసాద్, శ్రీనివాసులు, వేణుప్రసాద్‌రాజు, నాగరాజు, సూర్యచంద్ర పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


నూతనంగా నిర్మించిన అంకాలమ్మ ఆలయం

సుండుపల్లె, ఫిబ్రవరి 29: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ చెరుకువాండ్లపల్లెలో శుక్రవారం అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం, అభిషేకం నిర్వహించి అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీతో పాటు మండల నలుమూలల నుంచి భక్తులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 29: ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ మహిళ నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. గురువారం పట్టణంలోని ధర్మాపురంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాలపై మహిళలకు, యువతకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ అధికారంలోకి రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, కప్పల మధు, వెంకట సుబ్బయ్య, కప్పల రజినీ, మద్దిన గిరినాయుడు, మావిళ్ల రామయ్య, మిట్టవీధి మధు, నగిరిపాటి సంతోష్ పాల్గొన్నారు.

సౌమ్యకరిది.. ప్రచారం రాష్ట్రానిది : బీజేపీ


విలేకర్లతో మాట్లాడుతున్న సాయిలోకేశ్, రమేశ్‌నాయుడు

చిట్వేలి, ఫిబ్రవరి 29: సొమ్మొకరిది సోకు తమదని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రచారం చేసుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నాగోతు రమేశ్‌నాయుడుతో కలిసి చిట్వేలిలో పర్యటించి రాబోయే ఎన్నికల కోసం కార్యకర్తలను సమాయత్తం చేశారు. భారత్ మాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో వేల కోట్లతో రాష్ట్రంలో నేషనల్ హైవే రహదారులను నిర్మిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం రహదారులను అధ్వానంగా నిర్వహిస్తోందన్నారు. గ్రామ సచివాలయాలకు, అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే వాటిని కూడా తమ కోసం వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడండి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 29: సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ అనుబంధ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసులు అన్నారు. మంగంపేటలో మైనింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు అధ్యక్షత వహించగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, సీహెచ్ చంద్రశేఖర్, ఏపీ ఎండీసీ పోరాట కమిటీ జేఏసీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ సీఐటీయూ మాత్రమే కార్మిక పక్షపాతం అని రుజువైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్, సురేంద్ర, శివకుమార్, శంకర్‌రాజు, శ్రీనివాసరెడ్డి, వెంకట్‌రాజు, గున్న, డ్రైవర్స్ ఆపరేటర్లు, కార్మికులు పాల్గొన్నారు.


టీడీపీ, జనసేన కలయిక ఓ కీలక పరిణామం

● రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు


విలేకర్లతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, ఫిబ్రవరి 29: ప్రస్తుత వైసీపీ అరాచక పరిపాలన నుంచి రాష్ట్రం బయటపడాలంటే టీడీపీ, జనసేన కలయికే ఈ కీలక ఘట్టమని టీడీపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. గురువారం రాజంపేట పార్లమెంటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరాచక విధ్వంసకర వైసీపీ పరిపాలన అంతమే లక్ష్యంగా టీడీపీ, జనసేన ఉమ్మడి పార్టీలు కలిసి తాడేపల్లె గూడెంలో బుధవారం నిర్వహించిన సభ సూపర్ సక్సెస్ కావడం చూస్తే ప్రజల్లో జగన్‌పై ఉన్న వ్యతిరేకత స్పష్టంగా తెలుస్తోందన్నారు. తాడేపల్లె గూడెం జెండా బహిరంగ సభను చూసి జగన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం భారీ మెజార్టీతో అధికారం చేజిక్కించుకోవడం తథ్యమన్నారు. వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ కెప్టెన్ హనుమా విహారి వైదొలగడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపేదవానికి సంక్షేమ పథకాలు రావాలన్నా, సాగునీటి ప్రాజెక్టు రావాలన్నా, ప్రతి నిరుద్యోగికి జాబు రావాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా టీడీపీ, జనసేన కూటమి రావాలన్నారు. అమరావతి రాజధాని పునఃనిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.

చంద్రబాబుతో 'ముక్కా' చర్చలు


చంద్రబాబును కలిసిన రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 29: నియోజకవర్గ రాజకీయాలపై టీడీపీ నేత ముక్కా రూపానందరెడ్డి మాజీ సీఎం చంద్రబాబునాయుడుతో గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ పార్టీ టిక్కెట్టు ఎవరికి ఇచ్చినా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కనీవిని ఎరుగని స్థాయిలో టీడీపీ, జనసేన సంయుక్త ప్రచారం ఉంటుందన్నారు. వైసీపీ ఓటమే తన లక్ష్యంగా పెట్టుకుని పార్టీని గెలిపించుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన సంయుక్తంగా పనిచేసి అభ్యర్థికి భారీగా మెజార్టీ వచ్చే విధంగా చూపిస్తామన్నారు. వైసీపీకి రైల్వేకోడూరులో రాజకీయ గోడ కడతామని తెలిపారు. ఎప్పుడూ చూడని ఓటమి వైసీపీకి చూపిస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యత చాలా అవసరం

● లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి



నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 29: ప్రతి వ్యక్తికి చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యత అవసరమని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని షిరిడీ సాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఈ ఏడాది 2024 ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. అనంతరం విద్యార్థినీలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, ఇరువురికి కన్సొలేషన్ బహుమ తులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వెంకటచలమారెడ్డి, కళాశాల డైరెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థినీలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

రాజంపేటటౌన్, ఫిబ్రవరి 29: రాజంపేట పట్టణంలో గురువారం బీజేపీ అసెంబ్లీ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ చౌదరి, వెంకటసుబ్బరాజులను వారు పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు అసెంబ్లీ పరిధిలో సంస్థాగతంగా బీజేపీ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకొని ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణాయాదవ్, గజపతి, నాగేశ్వర్‌రావు, జగదీష్, గుణవర్మ తదితరులు పాల్గొన్నారు.

'నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి'


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 29: నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం వండితే సంగటి లా తయారవుతుందని, ఈ భోజనాన్ని తిన్న విద్యార్థులు కడపునొప్పి తదితర రోగాలతో బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేనందున విద్యార్థులపై దోమలు దాడులు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయకపోతే మాత్రం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇళ్ల పేరుతో అప్పులపాలు : విశ్వనాథనాయుడు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 29: ఇళ్ల పేరుతో సీఎం జగన్ పేదల్ని అప్పుల పాలు చేశాడని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. గురువారం రైల్వేకోడూరు పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి 5 లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పి మడమ తిప్పారన్నారు. ఉచితంగా ఇవ్వకపోగా గృహ నిర్మాణం పేరుతో పేదల్ని అప్పులపాలు చేశాడని తెలిపారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని పేదల్ని బెదిరించారన్నారు. చంద్రబాబు కేంద్రం ఇచ్చిన నిధులకు తోడు గ్రామాల్లో ఇళ్లకు రాష్ట్ర నిధుల నుంచి రూ.50 వేలు, పట్టణాల్లో రూ.లక్ష అదనంగా ఇచ్చారన్నారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో అగ్గిపెట్టె లాంటి నిర్మాణం స్థానంలో నివాస యోగ్యమైన ధృడమైన గేటెడ్ కమ్యూనిటీ లాంటి ఇళ్లను చంద్రబాబు నిర్మాణాలు చేయించారన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మహిళా నాయకురాలు నగిరిపాటి రేవతి, దళిత నాయకులు పుల్లెల రమేష్‌బాబు, తేనేపల్లి చిన్నా, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, రాజ పాల్గొన్నారు.

రాజంపేట అన్నమాచార్యలో వర్క్‌షాపు

రాజంపేట, ఫిబ్రవరి 29: రాజంపేట మండలం అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐడీఎస్ డిపార్ట్‌మెంట్‌లో ఐఓటీ వర్క్‌షాపు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నారాయణ తెలిపారు. 26 నుంచి వర్క్‌షాపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.కె.సి.గణేష్ ఆధ్వర్యంలో ఐఓటీ స్మార్ట్ సెన్సార్లు, రిమోట్ మానిటరింగ్, సమర్థవంతమైన డేటా మార్పిడితో హోం ఆటోమిషన్, వాహన ట్రాకింగ్, రోబోటిక్ ప్రోగ్రాం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుబ్బారావు, కో-ఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల వీరంగం

10 గొర్రెలు మృతి - మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలు



మృతి చెందిన గొర్రెలు

సోమల, ఫిబ్రవరి 29: నంజంపేట గొల్లపల్లెలో బుధవారం అర్ధరాత్రి వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. రెడ్డెప్ప యాదవ్ గొర్రె మందలోని 10 గొర్రెలు మృతి చెందగా మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంటి సమీపంలోని గొర్రెల మందలో ప్రవేశించిన వీధి కుక్కలు విచ్చల విడిగా దాడి చేశాయి. రెడ్డెప్ప కుటుంబ సభ్యులు గొర్రెల అరుపులు విని వచ్చేలోపు వీరంగం సృష్టించాయి. దీంతో పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారి చందనప్రియ సిబ్బందితో కలసి గాయపడ్డ గొర్రెలకు చికిత్సలు అందించారు. వీధి కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సచివాలయంలో ఫిర్యాదు చేశారు.

ఒంటరి ఏనుగు విధ్వంసం



ఏనుగు విరిచేసిన రాతి కూసాలు

ఐరాల, ఫిబ్రవరి 29: ఐరాల మండలం వినాయకపురంలోని పొలాల్లో ఒంటరి ఏనుగు మామిడి తోటను ధ్వంసం చేసింది. పంట పొలాలు, బోర్లు విరిచి వేసింది. మోహన్‌రెడ్డికి చెందిన మామిడి తోట కంచెను ధ్వంసం చేసింది. వీరభద్రారెడ్డి, వినయ్‌రెడ్డికి చెందిన మామిడి చెట్ల కొమ్మలను విరిచి వేసింది. ఏనుగు సంచరిస్తుండటం వలన రైతులు రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగును దూరంగా తరిమి వేయాలని రైతులు కోరుతున్నారు.

3న పోలియో చుక్కల కార్యక్రమం

● 0-5 ఏళ్ల పిల్లలకు వేయించాలన్న కలెక్టర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

చిత్తూరు, ఫిబ్రవరి 29: జిల్లాలో మార్చి 3వ తేదీన 0-5 ఏళ్లలోపు పిల్లలకు విధిగా పోలియో చుక్కలను వేయించాలని, ఆ దిశగా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గురువారం పోలియో చుక్కలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేయించాలన్నారు. జిల్లాలో 69 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ కేంద్రాల పరిధిలో ఎనిమిది మంది ప్రోగ్రామ్ అధికారుల ద్వారా 142 రూట్లలో 1415 కేంద్రాల ద్వారా 209971 మంది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందన్నారు. ఇందులో 149 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించామని, వీటిని మొబైల్ బూత్‌ల ద్వారా కవర్ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి రవిరాజు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, డీపీఎంవో హర్షవర్ధన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు జేవీడీ నిధుల విడుదల



మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు, ఫిబ్రవరి 29: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి జగనన్న విద్యాదీవెన మొదటి విడత నిధులను శుక్రవారం తల్లుల ఖాతాలకు జమ చేయనున్నారు. ఉదయం 11 గంటలకు కృష్ణా జిల్లా పామర్రులో సీఎం జగన్ బటన్ నొక్కి నిధులు జమ చేస్తారని జిల్లా బీసీ సంక్షేమం సంఘం, సాధికారిత అధికారి రబ్బానీ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 32427 మంది విద్యార్థులకు రూ.20.54 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు.

ఎన్నికలను సమన్వయంతో నిర్వహించాలి : డీఆర్వో

చిత్తూరు, ఫిబ్రవరి 29: రాబోయే సార్వత్రిక ఎన్నికలను అధికారులందరూ సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలని డీఆర్వో పుల్లయ్య కోరారు. గురువారం డీఆర్‌డీఏ సమావేశపు హాలులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివయ్యతో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు 16 బృందాలను ఏర్పాటు చేశామని, ఇకపై ప్రతి రోజు నోడల్ అధికారులతో పాటు వారికి కేటాయించిన సహాయక సిబ్బంది ఎన్నికల పనులను చేయాల్సి ఉందన్నారు. ప్రతి రోజు రిపోర్టులను ఆర్వోల ద్వారా మాత్రమే పంపించాలన్నారు. ఎక్కువ ఫిర్యాదులు ఎంసీసీ నుంచి వస్తాయని, వాటిని బాధ్యతగా తీసుకుని పనిచేయాలన్నారు. అందరికీ శిక్షణ ఇవ్వడం ద్వారా ఎన్నికల్లో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్లు, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రికొండ అడవికి నిప్పు



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 29: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్డు సమీపంలోని ఎర్రికొండ అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆకతాయిల చర్యతో అడవిలోని జీవరాశులు, చెట్లు కాలి బూడిదయ్యాయి. గతంలోనూ అడవికి నిప్పు పెట్టినా.. అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు నిఘా పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పద్మావతి వర్సిటీలో యూఎస్ కాన్సులేట్



యూఎస్ కాన్సులేట్ నౌషీన్ ఆలీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: పద్మావతి మహిళా యూనివర్సిటీని యూఎస్ కాన్సులేట్ నౌషీన్ ఆలీ గురువారం సందర్శించారు. యూఎస్ఏలో విద్యా, ఉపాధి అవకాశాలకు సంబంధించిన విషయమై వీసీ ప్రొఫెసర్ భారతితో ఆమె చర్చించారు. అవగాహనా ఒప్పందాలు చేసుకుని పరస్పరం బోధన, పరిశోధన రంగాల్లో సహకరించుకుంటామని వీసీ భారతి, నౌషీర్ ఆలీ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రజని పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకారంలో కాటమరాజు - చాందిని బండిలో ఊరేగుతున్న కాటమరాజు - ప్రత్యేక అలంకారంలో చాందిని బండ్లు

వైభవంగా ఆవుల పబ్బం వేడుకలు

చౌడేపల్లె, ఫిబ్రవరి29: ఆవుల పబ్బం పేరుతో నిర్వహించే సంక్రాంతి పండుగ గురువారం వైభవంగా ప్రారంభమైంది. మండలంలోని నుంజార్లపల్లె, సింగిరిగుంట, నూనెముద్దలపల్లె, పేరావాండ్లపల్లె, పరికిదోన, దొనపల్లె, చిన్నకంపల్లె, మల్లెలవారిపల్లె, దిగువమల్లెలవారిపల్లె, సామిరెడ్డిపల్లె, మడుకూరు, మొరంకిందపల్లె, చౌడగానిపల్లె, గడ్డంవారిపల్లె గ్రామాల ప్రజలు ఆవుల పబ్బం పేరుతో సామూహికంగా పశువుల పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నుంజార్లపల్లె చాందిని బండిలో కాటమరాజు ఉత్సవమూర్తిని ఏర్పాటుచేసి మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్కభజనలు, బల్లారి డ్రమ్స్‌తో గ్రామాలలో ఊరేగిస్తూ పరికిదొన సమీపంలో ఉన్న నాగప్ప చెరువు వద్దకు తీసుకు వచ్చారు. అలాగే దిగువమల్లెలవారిపల్లె నుంచి రెండు చాందిని బండ్లు, దొనపల్లె, పరికిదొన, పరికిదొన ఎస్సీ కాలనీ, పేరాపల్లె, నూనెముద్దలవారిపల్లె గ్రామాల నుంచి చాందిని బండ్లు నాగప్ప చెరువు వద్దకు వచ్చాయి. పశువులను ప్రత్యేకంగా అలంకరించి నాగప్ప చెరువు వద్దకు తీసుకువచ్చి కాటమరాజు విగ్రహానికి ప్రదక్షణలు చేయించారు. కాటమరాజు ఉన్న చాందినిబండి వెంట నాగప్పచెరువు కట్ట నుంచి దొనపల్లె అటవీ ప్రాంతంలో ఉన్న కాటమరాజు ఆలయం వద్దకు వెళ్లాయి. చాందినిబండ్లను చూసేందుకు 14 గ్రామాల ప్రజలు నాగప్పచెరువు వద్దకు రావటంతో చెరువు జన సంద్రంగా మారింది.

అంతా అయ్యాక అనుమతులు!

టీటీడీ ఉద్యోగుల లేఅవుట్‌కు వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ - ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు

తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిలో ఏదైనా లే అవుట్ వేయాలంటే నివాసయోగ్యమైన స్థలంగా ప్రభుత్వం దగ్గర మార్చుకోవాలి. ఆ తర్వాత స్థానిక పట్టణాభివృద్ధి సంస్థ అప్రూవల్ తీసుకోవాలి. అప్పుడే ప్లాట్లను విక్రయించడం, రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. కానీ టీటీడీ ఉద్యోగులకు వడమాలపేట దగ్గర ఇచ్చిన ప్లాట్లకు మాత్రం ఇలాంటి నిబంధనలు ఏమీ వర్తించలేదు. ఎలాంటి అనుమతులూ లేకుండానే పేపర్‌పై స్కెచ్ వేసి, లాటరీ తీసి నెంబర్లు కేటాయించేశారు.అంతేకాదు కొందరికి రిజిస్ట్రేషన్ తంతు కూడా పూర్తిచేశారు. అంతా అయ్యాక ఇప్పుడు భూమి మార్పు కోసం అందులోని ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు రద్దు కోసం ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకున్నారు.ఈ మేరకు గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగపు ముఖ్యకార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. వడమాలపేట మండలం, పాదిరేడు అరణ్యం గ్రామంలోని 417.16 ఎకరాల వ్యవసాయ భూమిలో టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే వ్యవసాయ భూమి నుంచి రెసిడెన్షియల్‌గా వర్గీకరణ జరగలేదు. ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు దాదాపు రూ.5.5కోట్లు తుడాకు టీటీడీ చెల్లించింది. దీంతో రెసిడెన్షియల్‌గా మార్పు చేయడంతో పాటు సదరు స్థలంలో 60 మీటర్ల తుడా ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డును కూడా రద్దుచేస్తూ శ్రీలక్ష్మి ఉత్తర్వులు ఇచ్చారు.దీనితర్వాత మళ్లీ లే అవుట్ అప్రూవల్ తీసుకోవాల్సివుంది.సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రైవేట్ సంస్థలకు అన్ని అనుమతులూ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తారు. మరి అనుమతులు లేకుండా టీటీడీ ఉద్యోగులకు జరుగుతున్న రిజిస్ట్రేషన్లు ఎంత వరకు చెల్లుబాటవుతాయన్న ఆందోళన ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

ప్రత్యేకహోదాయే ప్రధానాస్త్రం

నేడు తిరుపతిలో కాంగ్రెస్ భారీ బహిరంగసభ

పదేళ్ళ కిందట మోదీ హామీలిచ్చిన చోటే నిర్వహణ

ఏఐసీసీ నేత సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ షర్మిల రాక



తిరుపతి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగసభ నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేపట్టింది. ఎస్వీ యూనివర్శిటీ స్టేడియంలో నేటి సాయంత్రం 4 గంటలకు జరగనున్న బహిరంగసభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల,రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరు కానున్నారు. దీనికోసం సచిన్ పైలెట్ బెంగుళూరు నుంచీ షర్మిల హైదరాబాదు నుంచీ విమానాల్లో తిరుపతి చేరుకోనున్నారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుపతిలో నిర్వహించిన బహిరంగసభలో నరేంద్ర మోదీ బీజేపీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో బీజేపీ సభ నిర్వహించిన ఎస్వీయూ స్టేడియంలోనే ఇపుడు కాంగ్రెస్ పార్టీ కూడా బహిరంగసభ ఏర్పాటు చేస్తోంది. అదే చోట సభ జరిపి మోదీ హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు హామీల అమలుపై మోదీని కాంగ్రెస్ నేతలు నిలదీయనున్నారు. వైఎస్ షర్మిల పీసీపీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఇదివరకే తిరుపతిలో సమావేశం నిర్వహించినప్పటికీ అది పార్టీ అంతర్గత సమావేశం. బహిరంగసభ జరపడం మాత్రం ఇదే తొలిసారి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో తొలి బహిరంగసభ కావడంతో దీన్ని ఎలాగైనా విజయవంతం చేయాలని పార్టీ నాయకులు శ్రమిస్తున్నారు. 30 వేలమందితో సభ జరపాలని, దానికోసం ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జనసమీకరణ చేయాలని ప్రయత్నిస్తున్నారు. బహిరంగ సభా స్థలిలో ఏర్పాట్లను గురువారం పీసీపీ మాజీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మాజీ ఎంపీ చింతా మోహన్, పీసీసీ నేత తులసిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ఆస్తి కోసం తమ్ముడినే చంపేశాడు!

● పులిబోనువారిపల్లెవాసి హత్య కేసులో సోదరుడు సహా నలుగురికి రిమాండ్



హతుడు చంద్రశేఖర రెడ్డి (పాత చిత్రం)

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 29: ఆస్తి కోసం అన్నే తన కుమారుడితో కలిసి తమ్ముడిని దారుణంగా నరికి చంపేశాడని పోలీసులు నిర్ధారించారు. తిరుపతి రూరల్ మండలం కాలూరు క్రాస్ వద్ద ఈనెల 25న జరిగిన చంద్రశేఖర రెడ్డి (50) హత్య కేసులో నలుగురు నిందితులను రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయితీ, పులిబోనువారిపల్లెకు చెందిన భాస్కరరెడ్డి కుమారులు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖరరెడ్డి(50)కి నడుమ ఆస్తి తగాదాలున్నాయి. రౌడీషీటరైన రామ్మోహన్‌రెడ్డి కొన్నేళ్లుగా తిరుపతి బొమ్మగుంటలో నివాసం ఉంటుండగా చంద్రశేఖరరెడ్డి స్వగ్రామంలోనే నివసిస్తున్నాడు. చంద్రశేఖరరెడ్డి కుమారులు కాలూరు క్రాస్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నారు. ఈనెల 25న ఆదివారం కావడంతో పిల్లలను చూసేందుకు చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వచ్చాడు. పిల్లలు తినుబండారాలు కావాలనడంతో బయటకు వచ్చిన చంద్రశేఖరరెడ్డి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పాఠశాల సమీపంలోనే మాటువేసిన ఆయన అన్న రామ్మోహన్‌రెడ్డి, ఆయన కుమారుడు పురుషోత్తం రెడ్డి, అతని స్నేహితులు యోగి, చింతకాయల వీధికి చెందిన మరో మైనర్ బాలుడు కలిసి చంద్రశేఖరరెడ్డిపై దాడి చేశారు. బైక్ పైనుంచి కిందపడిపోయిన చంద్రశేఖరరెడ్డి పారిపోయేందుకు ప్రయత్నించగా ఆ ఐదుగురూ వెంటాడి కత్తులతో నరికి చంపారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు గురువారం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. రామ్మోహన్‌రెడ్డిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, ఎర్రావారిపాలెం పోలీసు స్టేషన్‌లో కేసులున్నాయి.

ఈ పదేళ్లలో అత్యద్భుత ఆవిష్కరణలు

కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29: గడిచిన పదేళ్లలో దేశంలో ఎన్నో అత్యద్భుత ఆవిష్కరణలు జరిగాయని డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. అఖిల భారత శిక్షక్ మహా సంఘ్(ఏబీఆర్ఎస్ఎం) ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో ఆత్మ నిర్భర భారత్ - సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో పదేళ్లలో ఎన్నో గొప్ప పనులు జరిగాయన్నారు. ఆ రంగంలో జరిగిన పరిశోధనలు, ఆవిష్కరణలు ఇందుకు నిదర్శనమన్నారు. నూతన ఆయుధాల కొనుగోళ్లకు విదేశాలపై ఆధారపడటం చాలా వరకూ తగ్గిందన్నారు. తద్వారా రూ.వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని విశ్వగురువుగా నిలిపే బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ఇందుకు అవసరమైన బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ శతాబ్దం చివరికి శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగంలో మన దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ నేత లక్ష్మణ్ మాట్లాడారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీకి అశోకరాజు రాజీనామా

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 29: టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, సిద్ధార్థ ఇంజనీరింగు కళాశాలల ఛైర్మన్ అశోకరాజు ప్రకటించారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుదీర్ఘకాలం పార్టీలో తనను ఆదరించి అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను చెబుతానన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ ప్రోటోకాల్ వివాదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ ప్రోటోకాల్ వివాదం తెరమీదకు వచ్చింది. నిత్యం వివాదాల్లో ఉండే శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారు మరో వివాదంలో చిక్కుకున్నారు. 2022వ సంవత్సరం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికల్లో ఎంపీ గురుమూర్తి ఫొటో, పేరు విస్మరించిన దేవ స్థానం అధికారులు, ఈ సారి ఎమ్మెల్సీ సభ్యులను విస్మరించారు. ఆహ్వాన పత్రికలు అట్టహాసంగా విడుదల చేశారు. అందులో భారీగా ప్రోటోకాల్ తప్పిదాలు వెలుగు చూడటంతో అందరూ విస్తుపోయారు. దాంతో పత్రికలు బయటకు రాకుండా అప్పటి కప్పుడే దాచేశారు. ముందు పేజీలో సీఎం ప్రోటోకాల్ ముద్రించాల్సి ఉండగా ఆలయపాలక మండలి సభ్యుల పేర్లను అచ్చు వేశారు. ఇలాంటి వివాదాల ఆహ్వాన ప్రతికపై స్థానిక నేతగా ఉన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఫొటో అచ్చు వేయలేదన్న ప్రశ్న పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. దీనిపై ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఆలయ చరిత్రలో ఇప్పటివరకు ఏ ఎమ్మెల్సీ ఫొటో కూడా వేయలేదన్నారు. ఈ సారి మళ్లీ ఆహ్వాన పత్రి కలు ముద్రించాల్సి వచ్చింది కాబట్టి జిల్లాలోని అందరి ఎమ్మెల్సీల చిత్రాలు పొందు పరుస్తామన్నారు. ఈ క్రమంలో మిద్దెల హరి ఇటీవల ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. గురువారం జరిగిన సమన్వయ సమావేశానికి ఆయన్ను ఆహ్వానించ లేదు. దీంతో ఆయన పలువురి వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. క్యాబినెట్ స్థాయి కలిగిన తనను దేవస్థానం వారు విస్మరించడం ఎంతవరకు సమంజసమని ఆయన వాపోతు న్నట్టు తెలిసింది. అధికారులకు తెలియకపోయి నా మండలి అయినా ఎందుకు చొరవతీసుకో లేదన్నది రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,784 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, ఎంపీ ప్రఫుల్ పటేల్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమాన్ని శనివారం ఉదయం తిరుమలలో నిర్వహించనున్నారు. అన్నమయ్య భవనంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదులను ఈవో ధర్మారెడ్డి దృష్టికి తీసుకురావచ్చు. దీనికోసం 0877-22630261ను సంప్రదించాల్సి ఉంటుంది.

టెట్‌కు 729 మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 29: జిల్లాలోని మూడు, చెన్నైలోని ఒక సెంటర్‌లో మూడో రోజైన గురువారం నిర్వహించిన టెట్‌కు 729 మంది హాజరైనట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మొత్తం 826 మంది అభ్యర్థులకు గాను 729 మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 413 మందికిగాను 353 మంది.. మధ్యాహ్నం 413కిగాను 376 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురంలోని వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఉదయం ధ్వజారోహణ వేడుక వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా గరుత్మంతుడిని కొత్త వస్త్రంపై లిఖించి కంకణ భట్టర్ శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు.రాత్రి వాహన సేవలు ప్రారంభమయ్యాయి. పెద్ద శేష వాహనంపై కృష్ణావతారంలో వైకుంఠనాథుడు భక్తులకు దర్శనమిచ్చారు.

- చంద్రగిరి

శివరాత్రి ఉత్సవాల్లో సామాన్యులకే పెద్దపీట



సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 29: ముక్కంటి ఆలయంలో జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట వేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథి భవనంలో గురువారం పలు ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులను గత ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ ఆరా తీశారు.ఈ ఏడాది అమలు చేయాల్సిన విధానాలపై సూచనలు చేశారు. అత్యవసర సేవలపై అధికారులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు.బాల్య వివాహాల నిర్మూలనకు రెవెన్యూ, ఐసీడీఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఉత్సవాల సమయంలో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని పురపాలక శాఖను, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అగ్నిమాపక వాహనం, 108 వాహనం ఆలయం వద్దనే నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై ఎస్పీ మలిక గార్గ్ పలు సూచనలు చేశారు.గత ఏడాది ఉత్సవాల్లో బందోబస్తును పర్యవేక్షించిన సీఐ అంజుయాదవ్ సమావేశానికి హాజరై క్యూలైన్ల విధానం, రద్దీ రోజుల్లో బందోబస్తు నిర్వహణ, రథోత్సవం, తెప్పోత్సవంలో చోరీలు జరగకుండా తీసుకున్న జాగ్రత్తలను వివరించారు.అవంతా విన్న ఎస్పీ ఈ ఏడాది అమలు చేయాల్సిన ఏర్పాట్లపై ఆలయంలో తిరిగి కసరత్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో రవిశంకర రెడ్డి, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్, ఎస్పీ ఆలయానికెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.నిత్యాన్నదానంలో కలెక్టర్ భక్తులతో కలిసి భోంచేశారు.

డీడీఈ సైకాలజీ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 29 : ఎస్వీయూ దూరవిద్యా సైకాలజీ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. మన బడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలు పొందుపర్చినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

తంబళ్లపల్లెను అరాచక కేంద్రంగా మార్చివేసిన వైసీపీ

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డే
● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 28: తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా అరాచకానికి కేంద్రంగా వైసీపీ ప్రభుత్వం మార్చివేసిందని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. ములకలచెరువులో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతో ప్రశాంతతంగా ఉండే నియోజకవర్గంలో అరాచకాలు, విధ్వంసాలు, దోపిడీలు, భూకబ్జాలు, మత్తు పదార్థాలకు నిలయంగా మారిపోయిందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విష సంస్కృతిని నియోజకవర్గంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రవేశపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. వాటన్నింటిని ప్రాలదోలాలంటే ఖచ్చితంగా టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలన్నారు. ప్రశాంతమైన తంబళ్లపల్లె కావాలంటే జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే ద్వారకాధరెడ్డి ఈ ప్రాంతానికి సంబంధించిన వ్యక్తి కాదని, జయచంద్రారెడ్డి ఈ ఊరులో పుట్టిన బిడ్డఅన్నారు. ఏ కష్టం వచ్చినా...ఏ నష్టం వచ్చినా తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలకు జయచంద్రారెడ్డి అండగా ఉంటారన్నారు. నూటికి నూరు శాతం తంబళ్లపల్లె నియోజకవర్గ అభ్యర్థి జయచంద్రారెడ్డేనన్నారు. టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు జయచంద్రారెడ్డిని అభ్యర్థిగా ప్రటించారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, రాజంపేట నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి యర్రగుడి సురేష్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్న కిష్టా, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, నేతలు అంజనేయరెడ్డి, శివన్న, అయూబ్ పాల్గొన్నారు.

వీరభద్ర ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 29: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ నల్లమాచిరెడ్డిగారిపల్లెలో రూ.1,07,50,000 నిధుల అంచనాతో వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో కలసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయనారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ విశ్వనాథ్, ఈవో రమణ, మల్లయ్యకొండ చైర్మన్ కేఆర్‌మల్‌రెడ్డి, మాజీ మల్లయ్యకొండ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలి



అధికారులతో సమీక్షిస్తున్న డీఏవో చంద్రానాయక్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 29: రబీ సీజన్‌లో రైతులు పండించిన పంట నమోదు వివరాలను అన్ని ఆర్బీకేల వద్ద జాబితాలను ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయంలో డివిజన్‌లోని ఏవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రతి గ్రామ పరిధిలోని రైతులు పండించిన పంటలను నమోదు చేయడం, ఈకేవైసీ చేయడం, సామాజిక తనిఖీ కోసం పంట వివరాలను ఆర్బీకేల వద్ద జాబితా ప్రదర్శించాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ఆర్బీకేల వద్ద రైతులు పండించిన పంటల వివరాలను జాబితాను ప్రదర్శించాలన్నారు. 4,5 తేదీల్లో రైతుల అభ్యంతరాలు ఏవైనా వుంటే ఆర్బీకే సిబ్బందికి తెలియజేయాలని తరువాత విచారించి తుది జాబితా ప్రకటిస్తారన్నారు. సమావేశంలో ఏవోలు నాగప్రసాద్, ఝాన్సీ, ఏఈవోలు పాల్గొన్నారు.

అర్హులకే ఆప్కాస్ ఉద్యోగాలు ఇవ్వండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బహుజన యువసేన నాయకులు

మదనపల్లె, ఫిబ్రవరి 29: మున్సిపాలిటీలో అర్హులకే ఆప్కాస్ ఉద్యోగాలు ఇవ్వాలని బహుజన యువసేన నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ఇక్కడ భర్తీ చేసిన నాలుగుపోస్టుల్లో అర్హత లేని, స్థానికేతరులకు అవకాశం కల్పించారని ఆరోపిస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం బైఠాయించారు. ఈ సందర్భంగా బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో పనిచేసి పదవీవిరమణ పొందిన, లేక అకాలమరణం చెందిన వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని అలా కాకుండా అర్హులకు, మున్సిపాలిటీకి సంబంధంలేని వ్యక్తులకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కౌన్సిల్‌ను సైతం తప్పుదోవ పట్టించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేస్తూ, పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ కమిషనర్ కె.ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బహుజన యువసే నాయకులు హరీష్, సుధాకర్, నవీన్, వెంకటేష్, రాజు, జగదీష్, మల్లికార్జున, శ్రీనివాసులు, కిశోర్, దేవేష్, వినయ్, శశికుమార్, ద్వారకనాథ్, సాదిక్, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

183 మంది ఉద్యోగాలకు ఎంపిక

బి.కొత్తకోట,ఫిబ్రవరి29: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 183 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాకు 362 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారికి రాత పరీక్ష, గ్రూప్ డిస్కసన్, హెచ్‌ఆర్ రౌండ్‌లలో వారిలో 183 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళా కు ముఖ్య అతిథిగా విచ్చేసిన నగరపంచాయతీ కమిషనర్ పీఎస్ మనోహర్ ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన వారిని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ ప్రసాద్, జిల్లా స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారి హరిక్రిష్ణలు అభినందించారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కో ఆర్డినేటర్ రేవతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్టుషాపులతో ప్రశాంతత కరువు

● మహిళలపైనా అక్రమ కేసులు పెట్టిన ఏకైక ప్రభుత్వం వైసీపీనే! ● చంద్రబాబు హయాంలో మహిళలకు గౌరవమర్యాదలు
● టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యం ● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



సూపర్ సిక్స్ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 29: అధికార పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన బెల్టుషాపుల కారణంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రశాంతత కరువైందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కేవీపల్లె మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ పరిధిలో గురువారం టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో మాట్లాడుతూ సంపూర్ణ మద్యనిషేధం చేస్తానని గత ఎన్నికల సందర్భంగా మహిళలకు మాట ఇచ్చిన సీఎం జగన్, అధికారంలోకి వచ్చాక మద్యాన్ని తమ ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని మద్యం ధరలను ఇబ్బుడిముబ్బుడిగా పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్నాడని మండిపడ్డారు. నాసికరం మద్యాన్ని రాష్ట్రంలో ఏరులా పారించి పేద ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారన్నారు. రా ప్రభుత్వ విధానాలను బహిరంగ, సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన మహిళలపైనా కూడా అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేసిన ఏకైక ప్రభుత్వం జగన్‌దేనన్నారు. చంద్రబాబు హయాంలో మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యతనిచ్చి వారికి సమాజంలో గౌరవమర్యాదలు కల్పించారన్నారు. డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చిన సంగతి గుర్తు చేసుకోవాలన్నారు. 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత కూడా చంద్రబాబు మహిళలకే ప్రాధాన్యత ఇస్తారని, ఇప్పటికే ఆయన ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో కూడా మహిళలకే పెద్దపీట వేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. జిల్లేళ్ల మంద పంచాయతీలోని జిల్లేళ్లమంద, పెండ్లిపెంట, పాళెంగడ్డ, కురవపల్లె, చింతలవారిపల్లె, ఎస్టీ కాలనీ, తాండా, దళిత వాడ, రాగలవారిపల్లె, కమ్మపల్లెల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఉయదశ్రీ, కేవీపల్లె మండల పార్టీ అధ్యక్షురాలు గీతాంజలి, రాజంపేట పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి, గాలి సుధాకర్ నాయుడు, కంచి సూరి, ప్రసాద్ రెడ్డి, శేషాద్రి నాయుడు, మౌలా, మహేంద్ర రెడ్డి, కంకడ్డర్ రమణ, రెడ్డిశేఖర్, రహంతుల్లా, రంజిత్, రెడ్డప్ప రెడ్డి, 'సంఘం' శివారెడ్డి, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

పగలు డంపింగ్....రాత్రి స్మగ్లింగ్

● రెచ్చిపోతున్న ఇసుకాసురులు
● పట్టించుకోని అధికారులు



సీటీఎం రోడ్డు తురకపల్లె ఈద్గా వద్ద అక్రమంగా నిల్వ వుంచిన ఇసుక భారీ డంప్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 29: వైసీపీ పాలనలో దోపిడికి ప్రధాన వనరు అయిన ఇసుకను మదనపల్లెలో కొంత మంది ఇసుకాసురులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. పగలంతా ట్రిపర్లతో దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పట్టణ శివార్లలో డంపింగ్ చేస్తున్నారు. రాత్రి అయితే చాలు డంపింగ్ స్థానాల నుంచి ట్రాక్టర్లకు ఎక్స్‌కవేటర్లతో లోడ్ చేసి పట్టణంలో స్మగ్లింగ్ చేస్తున్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో ఇసుకాసురుల గుట్టు రట్టు అయింది. మదనపల్లె మండలం తురకపల్లె(ఆరోగ్యవరం) సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈద్గా వెనుక 100 ట్రిప్పర్ల ఇసుక డంప్ చేశారు. అలాగే బెంగళూరు రోడ్డులోని చిప్పిలి గ్రామంలో ఇళ్ల వెనుక వైపు 50 ట్రిప్పర్ల దాకా ఇసుక డంప్ చేశారు. తురకపల్లెకు చెందిన ఓ వ్యక్తి, నక్కలదిన్నె, చిప్పిలి, అంకిశెట్టిపల్లె గ్రామాలకు చెందిన మరో ముగ్గురు వ్యక్తులు 15 దాకా చిన్న ట్రిప్పర్లు పెట్టి మండలంలోని చెరువు, టిడ్కో ఇళ్ల సమీపంలోని వంకల్లో ఇసుకను లోడ్ చేసి రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. పట్టణంలో ఎవరికి ఇసుక కావాలన్నా గంటల వ్యవధిలో ట్రాక్టర్లకు ఇసుక నింపి రాత్రికి రాత్రే ఇళ్ల నిర్మాణాల వద్దకు అక్రమ రవాణా చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..యథేచ్ఛగా అక్రమ రవాణా

ఇసుక అక్రమ రవాణా, నిల్వలపై రెవెన్యూ, ఎస్‌ఈబీ అధికారులు నిఘా పెట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాల్సి వుంది. కాని మదనపల్లె పట్టణ చుట్టుపక్కల మూడు చోట్ల భారీగా ఇసుక డంప్‌లు ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం వందల కొద్ది ట్రాక్టర్లు యథేచ్ఛంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు అటు వైపు చూడటం లేదు. రెవెన్యూ అధికారులేమో ఎన్నికల విధుల్లో ఉన్నామని చెబుతుంటే, ఎస్‌ఈబీ అధికారులు కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటుసారా దాడులకే పరిమితమై పోతున్నారు. దీంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఈ విషయమై మదనపల్లె తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా మేడమ్ మీటింగ్‌లో ఉన్నారని ఆమె అసిస్టెంట్ చెప్పడం గమనార్హం. అడప దడపా స్థానిక పోలీసులు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించడమో, కోర్టుకు తరలించడమో చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

పీలేరు, ఫిబ్రవరి 29: పదవీ విరమణ చేసిన తమ సహచరుడికి పీలేరు మండలం వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న టి.వెంకటరమణ గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి వెంకటరమణ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గంగాధర్, ఉపాధ్యాయులు రేణుక, షరీఫ్, రామ్మూర్తి, రమణయ్య, ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం, ఫిబ్రవరి 29: కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆరిఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి (అరవింద మదురై శాఖ)వారి సహకారంతో 675 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 34 మందికి కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏపీ శాసన మండలి ఉపాధ్యక్షురాలు జకీయాఖానం ప్రారంభించారు. కంటి వైద్యనిపుణులు మహేష్, నవకాంత్, ఆకాష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు. .

సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కలికిరి, ఫిబ్రవరి 29: కలికిరి పంచాయతీ బండకాడపల్లె సమీపంలో సారా విక్రయిస్తున్న జూపల్లె శ్రీనివాసులును కలికిరి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆర్. మోహన్ తెలిపిన వివరాల మేరకు.. ఏఎస్‌ఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి బండకాడపల్లె సమీపంలో నాటు సారా విక్రయిస్తున్న శ్రీనివాసులును అరెస్టు చేసి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 29: భర్తతో పాటు ద్విచక్రవాహనంలో వెళుతున్న మహిళ కింద పడి తీవ్రగాయాలపాలయ్యారు. గురువారం రాయచోటి మూసాపేటకు చెందిన సురేష్, శ్రీకన్య దంపతులు ద్విచక్రవాహనంలో నడిమిచెర్లకు బయలు దేరారు. మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోవడంతో శ్రీకన్య తలకు తీవ్రగాయం కాగా, సురేష్ స్వల్పగాయాలయ్యాయి. వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా శ్రీకన్య అపస్మారక స్థితిలో ఉండిపోయింది.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడండి

మదనపల్లె, ఫిబ్రవరి 29: వేసవి కాలం. పైగా ఎన్నికల సీజన్ కూడా అయినందున అధికారులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా మున్సిపల్ పరిధిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు స్పందించే కన్నా..ముందుగానే వార్డుల్లో పర్యటించి ఎక్కడెక్కడ సమస్య ఉందో గుర్తించాలని సూచించారు. కౌన్సిలర్ బీఏ ఖాజా మాట్లాడుతూ పట్టణంలోని ప్రతివార్డులోనూ బోరుమోటారు మరమ్మతుకు గురైనా నెలన్నర నుంచి రెండునెలలు అవుతోందని, ఫలితంగా ఆయా వార్డుల్లో తాగునీటి సమస్య అధికంగా ఉన్నట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే సిబ్బంది లేరని, పరికరాలు లేవని సమాధానం ఇస్తున్నట్లు తెలిపారు. ఏదైనా సమస్యపై ఫోన్ చేస్తే ఇంజనీరింగ్ అధికారులు ఫోన్ తీయడం లేదన్న పలువురు కౌన్సిలర్ల, వ్యాఖ్యలకు చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తీవ్రంగా స్పందించారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, కౌన్సిలర్ అయినా, ప్రజలు అయినా..ఫోన్ చేస్తే సమాధానం చెబితే, సగం సమస్య తీరిపోయినట్లనని పేర్కొన్నారు. కౌన్సిలర్ వాయిస్ కరీముల్లా మాట్లాడుతూ సచివాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది ప్రోటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. పట్టణంలోని 35వార్డులు ఉంటే, 43 సచివాలయాలు ఉండటం ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. ఒక్కోవార్డుకు ఒక్కో సచివాలయం ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సమావేశం దృష్టికి తెచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.ఎ.నూర్‌ఆజాం, పాల్ చంద్రశేఖర్‌లు పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అనంతరం అజెండాలోని 34 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోద ముద్రవేసింది.

కమనీయం.. వినాయకుడి కల్యాణం



వినాయకస్వామికి కల్యాణం చేస్తున్న అర్చకులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 29: పట్టణంలోని నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌లోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు సిద్ధులు, గౌరవాధ్యక్షుడు కాలాసోముశేఖర్, కమిటీ సభ్యులతో ముందుగా మహాకుంభాభిషేకం నిర్వహించారు. అంతకముందే ఆలయంలో గణపతి హోమం, వాస్తుహోమం, కలశారాధన కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం ప్రత్యేక అంలకరణలోని వినాయకస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రేపు తలనీలాలకు వేలం పాట

గుర్రంకొండ, ఫిబ్రవరి 29:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో శనివారం భక్తులు సమర్పించే తలనీలాలకు వేలం పాటను నిర్వహించనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. ఉదయం 10 గంటలకు వేలం పాట మొదలవుతుందన్నారు. ఆసక్తిగలవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 29: మండలంలోని సీటీఎం గ్రామంలో కాశీవిశ్వేశ్వర సావమి ఆలయంలో గురువారం నూతనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మదనపల్లెకు చెందిన చార్టెడ్ అకౌంటెట్ పీఎస్ చైతన్య, గాయిత్రి ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రారంభించారు. ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా వారికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

కలిచెర్లలో ఘనంగా గంధోత్సవం



గంధం ఉత్సవంలో కడపపెద్దదర్గా గురువు ఆరిఫుల్లా హుస్సేనీ

పెద్దమండ్యం, ఫిబ్రవరి 29: పెద్దమండ్య మండలం కలిచెర్ల గ్రామంలోని మౌలాకా పహాడ్‌లో గురువారం సాయంత్రం గంధం ఉత్సవం ఘనంగా జరిగింది. కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆరిఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో గంధం ఉత్సవం ఫాతేహ కార్యక్రమం జరిగింది. అనంతరం ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రదీప్ కుటుంబానికి కిశోర్ పరామర్శ

గుర్రంకొండ, ఫిబ్రవరి 29 మండలంలోని రామాపురం మాజీ సర్పంచ్ ప్రదీప్‌చంద్ కుమారుడు శ్రీహర్ష(20)ను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి గురువారం ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఆయన శ్రీహర్షను పరామర్శించి ప్రదీప్‌ను ఓదార్చారు.

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి

● మధ్యాహ్న భోజన నిర్వాహకులపై మండిపడ్డ కమిటీ సభ్యులు
● మెనూ ప్రకారం భోజనం చేయకపోతే మార్చేస్తాం



స్కూల్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 29 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం నిర్వాహకులు ఖచ్చితంగా విద్యార్థులకు అందించాలని పాఠశాల కమిటీ ఆదేశించింది. అలా పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకునే అధికారం ప్రధానోపాధ్యాయులకు ఉంటుందని పేర్కొంది. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై వస్తున్న ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని గురువారం పాఠశాలలో కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. అనేక సార్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆరోపణలు వస్తున్నా పాఠశాలలో మెనూ ప్రకారం చేయకపోవడమేంటని ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం సక్రమంగా చేసేందుకు అనేక కమిటీలు ఉన్నాయని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని చూస్తుంటే నిర్వాహకులు ఇలా సక్రమంగా చేయకుండా ఉంటే సహించేది లేదన్నారు. ఇంక ఎప్పుడైనా ఆరోపణలు వస్తే ఖచ్చితంగా భోజన నిర్వాహకులను మార్చేస్తామని ప్రధానోపాధ్యాయురాలుతో పాటు కమిటీ సభ్యులు హెచ్చరించారు. నిర్వాహకులు ఇటువంటివి పునరావృత్తం కాకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో అదే వంట నిర్వాహకులను కొనసాగించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం

పీలేరు, ఫిబ్రవరి 29: ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పీలేరు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం జరగనున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1396 మంది విద్యార్థులు, శనివారం జరగనున్న ద్వితీయ సంవత్సరంలో 1111 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన వివరించారు. పరీక్షల కోసం పీలేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, శ్రీమేధ జూనియర్ కళాశాల, చిత్తూరు మార్గంలోని సాంఘిక సంక్షేమ శాఖ జూనియర్ కళాశాల(అప్సరా కాలేజీ)లలో ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులకు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి రావాలన్నారు. నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు.

టీడీపీ- జనసేన సభతో తాడేపల్లె ప్యాలెస్ దద్దరిల్లింది



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు భవానిప్రసాద్, శ్రీనివాసులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 29: తాడేపల్లెగూడెంలో టీడీపీ-జనసేన కలసి ఉమ్మడిగా నిర్వహించిన తెలుగు జన బహిరంగ సభకు వచ్చిన ప్రజలను చూసి తాడేపల్లెలో సీఎం జగన్ ప్యాలెస్ దద్దరిల్లుతోందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు జోశపాలెం భవానిప్రసాద్, మండల అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరా చకాలను దోపిడిలపై టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోరాడుతున్నాయన్నారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. తాడేపల్లెగూడెం సభకు ప్రజలు వెళ్లకుండా వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించినా టీడీపీ, జన సైనికులు రెట్టించిన ఉత్సాహం తో సభలో పాల్గొన్నారని గుర్తుచేశారు. 5 కోట్ల ఆంధ్రు జీవితాల్లో వెలుగులు నింపాలని టీడీపీ, జనసేన కలిశాయన్నారు. చంద్రబాబును సీఎం చేయడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మన్న, మీడియా కో ఆర్డినేటర్ యర్రబల్లి వెంకటరమణారెడ్డి, తులసీధర్‌నాయుడు, మేకల రెడ్డిశేఖర్, కత్తి అరుణ్, ప్రభాకర్, పురుషోత్తం, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవాతో చెరువులను నింపకుండా జిమ్మిక్కులా!



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

బి. కొత్తకోట, ఫిబ్రవరి29: హంద్రీ-నీవా కాలువ ద్వారా స్థానిక చెరువులను నింపకుండా వైసీపీ ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు టి.క్రిష్ణప్పలు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక విలేఖరులతో వారు మాట్లాడారు. నిత్య కరువుతో అల్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ రైతాంగానికి సాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని కాలువ పరిధిలోకి వచ్చే చెరువులు, కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. బి. కొత్తకోటకు తాగునీటి కొరత తీరాలంటే కానుగలకుంట, పెద్దచెరువు, దేగానిచెరువులను వెంటనే హంద్రీ-నీవా నీటిని నింపాలని వారు కోరారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఉన్న మండలాలలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, పంటలు కోల్పోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి క్రిష్ణప్ప, రఘునాథ్, అస్రఫ్ అలీ, జవహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదాతో పాటు అభివృద్ధి సాధ్యమని మదనపల్లి నియోజకవర్గ నేత రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బస్టాండులో కార్యకర్తలతో కలసి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ఎన్నో పథకాలను ప్రజలకు అందిచిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఆధ్వర్యంలో పూర్వవైభవాన్ని సంతరించుకొనే విధంగా ప్రతి కార్యకర్త పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీసెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే బాషాసాబ్, మండల అధ్యక్షుడు ముబారక్, సురేంద్రరెడ్డి, మహ్మద్‌పీర్, శారదమ్మ, శంకర, షామీర్ ఖాన్, హరిప్రసాద్, నాగరాజ, గంగులప్ప, రామయ్య, ఖబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

మదనపల్లెలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరిక

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 29: మదనపల్లెలో రాజంపేట పార్లమెంట్ నాయకులు, పుంగనూరు కన్వీనర్ సింగం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో 30మంది గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తై షర్మిల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పదవి చేపట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఏపీలో బలోపేతమవుతోందన్నారు. 2024లో ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడంతోపాటు ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, ఈశ్వర్, పవన్‌కుమార్‌రెడ్డి సైదాని, రెడ్డెప్ప, రమేష్ పాల్గొన్నారు.

సీటీఎం నలవీరగంగాభవాని జాతర విజయవంతం



మీడియాతో మాట్లాడుతున్న ఆలయకమిటీ సభ్యులు

మదనపల్లె, ఫిబ్రవరి 29: మదనపల్లె మండలం సీటీఎం నలవీరగంగాభవానీ జాతర విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆలయకమిటీ సభ్యులు, సర్పంచి ఆనందపార్థసారధి, వెలుగు చంద్ర, పొగాకు వీరప్రతాప్, ఆనంద్, శివారెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక రోడ్లు, భవనాలశాఖ అతిథిగృహంలో గురువారం మీడియాతో వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పడమటి ప్రాంతంలో మొదట జరిగే..సీటీఎం నలవీరగంగా భవానీ అమ్మవారి తిరుణాళ్లకు ఆదరుణ ఉంటుందన్నారు. ఇందులోభాగంగా జిల్లాలోని నలుమూల నుంచే కాకుండా సరిహద్దులోని కర్ణాటక ఏరియాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన అన్నిశాఖలకు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

మిట్స్‌కు ఐఎస్ఓ గుర్తింపు...

కురబలకోట, ఫిబ్రవరి 29: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్ఓ(ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండరైజేషన్ 21001:2018) గుర్తింపు దక్కినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు, అభ్యాసనం, మూల్యాంకనం, పరిశోధనలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితర సదుపాయాలను పరిగణలోకి తీసుకుని టీయూవీ ఎస్‌యూడీ సంస్థ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఓఎంఎస్) గుర్తింపును అందజేశారు. ఐఎస్ఓ గుర్తింపు కళాశాలకు 2027 వరకు ఉంటుందని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. కళాశాలకు గుర్తింపు రావడంతో కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్ హర్షం వ్యక్తం చేశారు.